
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

సోమవారం 5 మే 2025

ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్టం	కనిష్టం
నెల్లూరు	40.4	27.2
కావలి	38	28
ఆత్మకూరు	41	28
ఉదయగిరి	38	27
కందుకూరు	37	28

ఆ రోడ్లు బాగు పడేదెప్పుడో..?

- ప్రభుత్వం ఓకే అన్నా... పనులు చేపట్టని అధికారులు
- మార్చిలో 13 రహదారుల మరమ్మతులకు నిధులు
- 95.31 కి.మీ మేర గుంతలు పూడ్చేందుకు అనుమతులు
- ప్యాచ్ వర్కులకు రూ.34.35 కోట్లు మంజూరు
- నెలగడిచినా టెండర్లు పిలవని ఆర్అండ్‌బీ
- ఇక తాజాగా మంజూరైన రోడ్ల పరిస్థితేమిటో..?



గుంతలతో అధ్వానంగా ఉన్న నందవరం- ఉదయగిరి రోడ్డు

నెల్లూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా తయారైంది ఆర్అండ్‌బీ రోడ్ల పరిస్థితి. గుంతలమయంగా మారిన రహదారులను బాగు చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా ఇంతవరకూ ఆర్అండ్‌బీ అధికారులు టెండర్లు పిలవలేదు. ప్రభుత్వం జీవో ఇచ్చి నెల గడిచినా కూడా ఇప్పటికీ ముందడుగు పడక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నా యి. ఇక ఎప్పుడు టెండర్లు పిలుస్తారు..? పనులు ఎప్పుడు మొదలు పెడతారు..? అన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. రాష్ట్రస్థాయిలో చీఫ్ ఇంజనీర్లు టెండర్ల ప్రక్రియపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందని జిల్లా ఆర్అండ్‌బీ అధికారులు చెబుతుండడం గమనార్హం.

మార్చిలో జిల్లాకు మంజూరైన నిధుల వివరాలు

రోడ్డు పేరు	బాగుచేయనున్న దూరం (కి.మీ)	నిధులు (రూ.లక్షలు)
బ్రహ్మదేవం-పొట్టెంపాడు రోడ్డు	1.30	50
మనుబోలు-కొలనకొదురు రోడ్డు	4	200
దువ్వూరు-ముక్తాపురం రోడ్డు	6.23	225
ఎంసీ రోడ్డు- కొండబిట్రగుంట రోడ్డు	5.19	200
కోవూరు-ఊటుకూరు రోడ్డు	13.90	350
నెల్లూరు-తాటిపర్తి రోడ్డు	2	80
సంగం-విరువూరు-కలువాయి రోడ్డు	18.40	850
పొదలకూరు-సోమశిల రోడ్డు	1	50
గూడూరు-దుగరాజపట్నం రోడ్డు	7.60	300
ఎన్‌హెచ్16 - వరగలి రోడ్డు	3.20	180
ఓజిలి - గొల్లపల్లి రోడ్డు	8.60	320
నందవరం - ఉదయగిరి రోడ్డు	13.89	250
మనుబోలు - పొదలకూరు రోడ్డు	10	350

● నిధులిచ్చి నెల దాటింది..

జిల్లాలో ప్రధాన రోడ్లపై ఉన్న గుంతలు పూడ్చి అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇందులో జిల్లా ప్రధాన రహదారులతో పాటు రాష్ట్ర రహదారులు కూడా ఉన్నాయి. మొత్తం 13 రోడ్లపై 95.31 కిలోమీటర్ల మేర ఉన్న గుంతలకు ప్యాచ్‌లు వేసేందుకు నిర్ణయించారు. అందుకు గానూ రూ.34.35 కోట్లను ప్రభుత్వం మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తం గా 536 కిలోమీటర్ల దూరం ఎండీఆర్(జిల్లా ప్రధాన రహదారులు) రోడ్లను బాగు చేసేందుకు రూ.200 కోట్లు మంజూరు చేస్తూ పరిపాలన అనుమ తులు జారీ చేయగా, అందులో ఆర్అండ్‌బీ నెల్లూరు సర్కిల్‌కు 30.62 కి.మీ బాగు చేసేందుకు గానూ రూ.10.55 కోట్లు మంజూరయ్యాయి. అలానే రాష్ట్ర వ్యాప్తంగా 890 కి.మీ రాష్ట్ర రహదారులు(ఎన్‌హెచ్) బాగు చేసేందుకు రూ.400 కోట్లు మంజూరు కాగా, అందులో ఉమ్మడి జిల్లాకు 64.69 కి.మీ బాగు చేసేందుకు రూ.23.80 కోట్లు కేటాయించారు. ఈ మేరకు ఆర్అండ్‌బీ సెక్రటరీ కాంతీలాల్ దండే మార్చి 29న ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో ప్రధాన కనెక్టివిటీ రోడ్లు ఈ జాబితాలో ఉన్నాయి. నెలలోపు టెండర్లు పిలిచి మూడు నెలల్లోపు పనులు పూర్తయ్యేలా ప్రణాళిక రచించుకున్నారు. ప్రభుత్వం కూడా రానున్న వర్షాకాలం సీజన్‌లోపు ఎక్కడా కూడా రోడ్లపై గుంతలు కనిపించకూడదని ఆదేశించింది. అయితే ప్రభుత్వం నుంచి పరిపాలనా,ఆర్థిక అనుమతులు మంజూరుచేస్తూ జీవో విడుదలైనా, రోడ్లను బాగు చేసే విషయంలో ముందడుగు పడలేదు.

● నాబార్డు ద్వారా మరో రూ.16.30 కోట్లు

మార్చిలో 13 రోడ్లకు రూ.34.35 కోట్లను జిల్లాకు మంజూరు చేసిన ప్రభుత్వం తాజాగా నాబార్డు కింద మరో ఆరు రోడ్లను బాగు చేసేందుకు ఇంకో రూ.16.30 కోట్లను మంజూరు చేసింది. ఈ మేరకు నాలుగు రోజుల క్రితం జీవో విడుదలైంది. వరిగొండ - జంగాలకండ్రిగ రోడ్డుకు రూ.3 కోట్లు, అన్నారెడ్డిపాలెం-దువ్వూరు రోడ్డుకు రూ.2.30 కోట్లు, వింజమూరు-కలిగిరి-బద్వేలు రోడ్డుకు రూ.2.50 కోట్లు, కరేడు ర్యాంప్ - చేవూరు రోడ్డుకు రూ.2.50 కోట్లు, గండవరం- పెదపుత్తేడు-ఊచగుంటపాలెం రోడ్డుకు రూ.2 కోట్లు, వరిణి-వీరారెడ్డిపాలెం రోడ్డుకు రూ.2.50 కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులతో ఆయా రహదారులపై ఉన్న గుంతలను పూడ్చనున్నారు. మరి ఈ రోడ్లకు ఎప్పటికీ టెండర్లు పిలుస్తారోనన్న ప్రశ్న తలెత్తు తోంది.

ఒంగోలులో రోడ్డు ప్రమాదం

- జిల్లా వాసులు ముగ్గురు దుర్మరణం
- మృతుల్లో ఇద్దరు గుడిపల్లిపాడుకి చెందిన కూలీలు
- మరొకరు నెల్లూరు వెంగళరావునగర్ వాసి



తిరగబడిన కోడిగుడ్ల లారీ



కోడిగుడ్ల లారీ బోల్తా పడటంతో మృతి చెందిన బాబు, నాగేంద్ర, రమణయ్య

ఒంగోలు క్రైం / కార్పొరేషన్/నెల్లూరు రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు సమీపంలో కొప్పోలు ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఆదివారం ఉదయం చోటుచేసుకున్న ప్రమాదంలో నెల్లూరు జిల్లా వాసులు ముగ్గురు మృతిచెందారు. అతివేగమే ప్రమాదానికి కారణమైంది. ముందు పంక్చరై ఆగి ఉన్న వాహనాన్ని కోడిగుడ్ల లారీ ఢీకొట్టడం, దాన్ని ఆ వెంటనే వెనుక నుంచి వరి కోత మిషన్ తో వస్తున్న లారీ ఢీకొట్టడంతో కోడిగుడ్ల లారీ బోల్తా కొట్టింది. అందులో ఉన్న నెల్లూరు జిల్లా నెల్లూరు రూరల్ మండలం గుడిపల్లి పాడుకు చెందిన రావి నూతల బాబు (42), రావి నూతల నాగేంద్ర (18), నెల్లూరు టౌన్‌లోని వెంగళ రావు నగర్‌కు చెందిన డ్రైవర్ షేక్ రహీం అలియాస్ రమణయ్య (60) అక్కడికక్కడే మృతి చెందారు.

● పనిలో.. చావులో కలిసే ప్రయాణం

వారివి రెక్కాడితేగాని డొక్కాడని నిరుపేద కుటుంబాలు. నెల్లూరులోని కోడిగుడ్ల వ్యాపారి వద్ద ఒకరు డ్రైవర్‌గా, మరో ఇద్దరు హెల్పర్‌లుగా కొన్నేళ్లుగా పనిచేస్తున్నారు. నిత్యం కలిసి ఉండేవారు ఒకేసారి ప్రాణాలు కోల్పోయారు. కోడిగుడ్ల వ్యాపారి వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్న రమణయ్య, బాబు, నాగేంద్రలు హైదరాబాద్ వెళ్లి కోడిగుడ్లను లోడ్ చేసుకుని తిరిగి నెల్లూరు వెళ్తున్న క్రమంలో జరిగిన ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందారు. రమణయ్యకు భార్య నలుగురు సంతానం ఉన్నారు. వీరిలో ఒక అమ్మాయికి పెళ్లిచేసి అత్తారింటికి పంపారు. ఒక అబ్బాయి, ఇద్దరు కూతుర్లు ఉండగా వారికి రమ ణయ్య పెద్దదిక్కు. ఆయన పనిచేసి పైసలు తెస్తేనే వారి కుటుంబం గడిచేది, ఆయన మృతితో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. మరో మృతుడు బాబుకు భార్య, ఇంటర్ చదవుతున్న కుమార్తె, ఎనిమిదో తరగతి చదువుతున్న కుమారుడు ఉన్నారు. బాబు మరణంతో ఆ కుటుంబం అంతులేని శోకంలో మునిగిపోయింది. మరో మృతుడు నాగేంద్ర కోడిగుడ్లు అమ్మే వాహనానికి హెల్పర్‌గా వెళుతూ వృద్ధులైన తల్లిదండ్రులకు అండగా ఉన్నారు. రోడ్డు ప్రమాదంలో నాగేంద్ర అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోవడంతో ఆయన తల్లిదండ్రులు భోరున విలపిస్తున్నారు. బాబు, నాగేంద్ర సమీప బంధువులు కావడం మరింత విషాదకరం.



రావినూతల బాబు (ఫైల్)



రావినూతల నాగేంద్ర (ఫైల్)

'నీట్'కు 97.90శాతం మంది హాజరు

- కట్టుదిట్టంగా పరీక్ష నిర్వహణ
- కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు



ఉత్కంఠ : హాల్‌టిక్కెట్ నెంబర్ ఎక్కడుందో... రూమెక్కడో..?



విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్న పోలీసులు

నెల్లూరు(విద్య), మే 4 (ఆంధ్రజ్యోతి) : ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశానికి జాతీయస్థాయిలో నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్-అండర్ గ్రాడ్యుయేట్(నీట్-యూజీ) ప్రవేశ పరీక్షను ఆదివారం నెల్లూరులో కట్టుదిట్టంగా నిర్వహించారు. ఈ పరీక్షకు కఠిన నిబంధనలు అమలు చేయడంతో విద్యార్థులు అనుకున్న సమయానికంటే ముందుగానే పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. అయితే కొన్ని కేంద్రాల వద్దకు ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను మాత్రం అనుమతించలేదు.

● ప్రశాంతంగా పరీక్ష

నీట్ పరీక్ష కట్టుదిట్టమైన నిబంధనల మధ్య ప్రశాంతంగా జరిగింది. నగరంలో 10 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 97.90శాతం మంది విద్యార్థులు హాజరయినట్లు అధికారులు తెలిపారు. ఒక్కో కేంద్రానికి ఒక జిల్లా అధికారిని నోడల్ ఆఫీసర్‌గా నియమించారు. పరీక్ష కేంద్రంలో కాపీయింగ్, పేపర్‌లీకేజీకి ఆస్కారం లేకుండా కఠిన నిబంధనలు అవలంబించారు. ఉదయం 11 నుంచే తనిఖీలు ప్రారంభించి 1.30 గంటలకు విద్యార్థులను పరీక్ష హాలులోకి అనుమతించారు. మొత్తం విద్యార్థులు 2,913 మంది కాగా పరీక్షకు 2,852 మంది హాజరయ్యారు 61 మంది గైర్హాజరయ్యారు.



నీట్ పరీక్ష కేంద్రమైన నగరంలోని డీకేడబ్ల్యూ కళాశాల ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రుల కోలాహలం

● మెటల్ డిటెక్టర్లతో పరిశీలన

విద్యార్థుల వస్త్ర. దారణ, ఆభరణాలపై కూడా ఆంక్షలు విధించారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద సీసీ కెమరాలు, జామర్‌లు ఏర్పాటు చేయడం తో పాటు పటిష్టమైన మెటల్ డిటెక్టర్‌తో తనిఖీలు నిర్వహించారు. హ్యాండ్‌బ్యాగులు, బెల్టులు, టోపీ, డెబిట్, క్రెడిట్ కార్డులతో సహా చేతికి వాచీ ధరించినా అనుమతించలేదు. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యార్థుల కోసం తల్లిదండ్రులు ఆయా పరీక్ష కేంద్రాల వద్దనే వేచి ఉన్నారు. పరీక్షకు హాజరైన విద్యార్థులు కొందరు మాట్లాడుతూ ఈ ఏడాది ప్రశ్నపత్రం చాలా కఠినంగా వచ్చిందన్నారు. అత్యధికశాతం మంది విద్యార్థులు పలు కేంద్రాల వద్ద కన్నీంటి పర్యంతం కాగా తల్లిదండ్రులు సర్దిచెపుతూ కనిపించారు.

◆◆◆

క్రీడలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి

- ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా అమలుకు జీవో జారీ
- శాప్ చైర్మన్ రవినాయుడు
- వీఎస్‌యూలో పురుషుల సాఫ్ట్‌బాల్ టోర్నీ ప్రారంభం
- తొలిరోజు పోటీలు హోరాహోరీగా...



ప్రసంగిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

వెంకటాచలం, మే 4 (ఆంధ్రజ్యోతి): క్రీడల పట్ల సీఎం నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖామంత్రి నారా లోకేష్ చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో ఆదివారం అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌ను వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కే.సునీతలతో కలిసి ఆయన ప్రారంభించారు. మొదటగా ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం పోటీలను ప్రారంభించి, మాట్లాడుతూ దేశంలో అత్యుత్తమంగా ఏపీలోనే స్పోర్ట్స్ పాలసీని ప్రభుత్వం రూపొందించిందన్నారు. ప్రణాళికాబద్ధంగానే దాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు క్రీడల్లో రాణించేలా విద్యాశాఖమంత్రి లోకేష్ అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. స్పోర్ట్స్ పాలసీలో పొందుపరిచిన రిజర్వేషన్ 3 శాతం అమలుకు జీవో జారీ చేసి, క్రీడల పట్ల సీఎం చంద్రబాబు తనకున్న చిత్తశుద్ధిని నిరూపించుకున్నారని పేర్కొన్నారు. స్పోర్ట్స్ కోటా 3శాతం అమలుతో ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ రంగసంస్థలు, పోలీస్, ఎక్సైజ్, అటవీశాఖలతోసహా యూనిఫామ్ సర్వీసులన్నింటిలోనూ రాత పరీక్షలు లేకుండానే క్రీడాకారులకు నేరుగా నియామకాలు లభిస్తాయని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కుంకాల నాగేంద్రప్రసాద్, రావూరి రాధాకృష్ణమనాయుడు, కట్టంరెడ్డి రాధాకృష్ణారెడ్డి, సర్వేపల్లి కాలువ డిస్ట్రిబ్యూషన్ చైర్మన్ చల్లా నాగార్జున రెడ్డి, వివిధ యూనివర్సిటీల క్రీడాకారులు, కోచ్‌లు, రెఫరీలు, వర్సిటీ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● హోరాహోరీగా మ్యాచ్‌లు

సాఫ్ట్‌బాల్ టోర్నీకి దేశవ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీల నుంచి 97 జట్లు హాజరయ్యాయి. కాగా తొలిరోజు 30 మ్యాచ్‌లు జరిగాయి. ప్రతి మ్యాచ్ హోరాహోరీగా సాగింది. వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత దగ్గరుండి పోటీలను పర్యవేక్షించారు. ఈనెల 8 వరకు పోటీలు జరగనున్నాయి. కాగా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వీఎస్‌యూకి వచ్చి సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌ను తిలకించారు.



హోరాహోరీగా తలపడుతున్న జట్లు

జిల్లాలో వర్ష బీభత్సం

- జోరుగా ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులు
- పలుచోట్ల విద్యుత్ అంతరాయం
- సాయంత్రం ఉన్నట్టుండి వర్షం
- పిడుగుపాటుకు వ్యక్తి మృతి
- ఒక్కసారిగా మారిన వాతావరణం



ఈదురుగాలులకు ముత్తుకూరు,కొండాపురం మండలం లింగనపాలెంలో నేలకూలిన చెట్లు

నెల్లూరు (హరనాథపురం) మే 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం రెండున్నర గంటలపాటు గాలివాన బీభత్సం సృష్టించింది. ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. మెట్ట ప్రాంతాల్లో కూడా వర్షం పడడంతో ఆ ప్రాంతరవాసులు ఆనందపడ్డారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం మూడుగంటల వరకు తీవ్రమైన ఎండతో ప్రజలు నానాఅవస్థలు పడ్డారు. సాయంత్రం 3 నుంచి 5.30గంటల వరకు గాలివాన వచ్చింది. కాగా నెల్లూరు నగరంలో నీట్ పరీక్షను రాసేందుకు పరీక్ష కేంద్రాల వద్దకు విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు కూడా పెద్ద సంఖ్యలో వచ్చారు. వారంతా వర్షంలో తడిసి ముద్దయ్యారు. మెట్ట ప్రాంతాల్లో వర్షం పడడంతో ఉద్యాన పంటలకు కొంతమేర నష్టం వాటిల్లినట్లు సమాచారం. నష్టాల వివరాలు తెలియాల్సి ఉంది. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు రావడంతో ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

● పిడుగు పాటుకి వ్యక్తి మృతి

రాపూరు మండలంలోని రావిగుంటపల్లి గ్రామానికి చెందిన తాటి బోయిన చిన్నయ్య (50) గొర్రెలు మేయడానికి అడవికి వెళ్లగా, పిడుగు పాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

● నేలకూలిన విద్యుత్ స్తంభాలు

ఆదివారం సాయంత్రం వీచిన గాలులకు కావలి ముసు నూరు దివ్యాంగుల కాలనీలో 11 కేవి విద్యుత్ స్తంభం విరిగి తీగల ఆపున ఊగసాగింది. దీంతో ఒక్కసారిగా మంటలు రేగి సరఫరా నిలిచి పోయింది. అలాగే కొండాపురం మండల పరిధిలో ఒక్కసారిగా బలమైన ఈదురుగాలులు వీచడంతో కొమ్మి సబ్‌స్టేషన్ నుంచి సత్యవోలుకు విద్యుత్ సరఫరా చేసే 11 కేవీ లైనులోని రెండు స్తంభాలతోపాటు లింగసపాలెంలో మూడు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. అలాగే పలు గ్రామాలలో చెట్లు నేలకొరిగాయి.

● ముత్తుకూరులో ఈదురు గాలుల తాకిడికి పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. ఎంపీడీవో కార్యాలయం వద్ద నీడనిచ్చే వృక్షం గాలి తాకిడికి విరిగి పడిపోయింది. కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.



పిడుగుపాటుకు మృతి చెందిన చిన్నయ్య

హెడ్‌కానిస్టేబుల్ రక్తదానం

కందుకూరు, మే 4(ఆంధ్రజ్యోతి): ఓ పేషెంటుకు అత్యవసరంగా ఓ నెగటివ్ రక్తం అవసరమని తెలిసి కందుకూరు సర్కిల్ ఆఫీసులో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ నర్రా శంకరరావు, సంతోష్‌నగర్‌కు చెందిన షేక్ ఆజాద్‌లు స్పందించి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. ఒంగోలు కిమ్స్ ఆసుపత్రిలో ఓ పేషెంటుకు మేజర్ గుండె శస్త్రచికిత్స జరుగుతుండగా ఓ నెగటివ్ రక్తం అవసరమైందని కందుకూరు రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి చెన్నా రామాంజనేయులు సంప్రదించగానే వీరిద్దరూ ఒంగోలు వెళ్లి రక్తదానం చేశారు.

న్యూస్ బాక్స్

7న ఉలవపాడు మండల పరిషత్ సమావేశం

ఉలవపాడు, మే 4(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈనెల 7వ తేదీన ఎంపీపీ వాయల మస్తానమ్మ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో ఎన్ విజయ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రతినిధులు, మండలస్థాయి అధికారులు సమావేశానికి హాజరు కావాలని పేర్కొన్నారు.

ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

కావలిటౌన్, మే 4(ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్, డాక్టర్ రామ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని పెంకుల ఫ్యాక్టరీ గిరిజన కాలనీ రామిరెడ్డి తోట వద్ద ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. న్యూ అగర్వాల్ ఐ కేర్ సెంటర్, విజేత ఐ హాస్పిటల్ వారి సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో వైద్యులు పరీక్షలు నిర్వహించి పలువురికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. వారిని శస్త్ర చికిత్సలకు నెల్లూరుకు తరలించారు. ఈ కార్యక్రమంలో ఏటూరి రామిరెడ్డి, మదన్‌మోహన్ రెడ్డి, డొడ్ల మనోహర్ రెడ్డి, తాతిరెడ్డి, స్వర్ణలత, సలీమ్‌బేగ్ పాల్గొన్నారు.

ఇరువురి ఘర్షణపై కేసు నమోదు

లింగసముద్రం, మే 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంగళాపురంలో ఓ ఇంటి స్థలం విషయమై బాబాయి, అబ్బాయి మధ్య శనివారం జరిగిన ఘర్షణపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ ఎం నారాయణ సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన జగన్నాథం తిరుపతయ్య తన ఇంటి పక్కన తనకు చెందిన ఖాళీ స్థలంలో తన అన్న కుమారుడు రమేష్‌ను ఇల్లు కట్టుకోమని గతంలో చెప్పాడు. అయితే రమేష్ ఆ స్థలంలో ఇల్లు కట్టుకోకుండా ఆ స్థలాన్ని విక్రయించేందుకు ప్రయత్నించాడు. దీనికి తిరుపతయ్య అంగీకరించలేదు. ఈ క్రమంలో రమేష్ ఆ స్థలంలో గుంజలు పాతుతుండగా తిరుపతయ్య అడ్డుకున్నాడు. దీంతో ఇరువురి మధ్య తీవ్ర వాగ్వివాదం జరగడంతో ఇరువురు కొట్టుకున్నారు. ఈ ఘర్షణలో తిరుపతయ్యకు గాయాలుకావడంతో చికిత్స నిమిత్తం కందుకూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈదురు గాలుల బీభత్సం

- విరిగి పడిన 11 కేవీ విద్యుత్ స్తంభం
- తాళ్లతో తాత్కాలిక మరమ్మతులు


కావలిరూరల్ : తాళ్లతో కట్టి ఉన్న విరిగిన స్తంభం

కావలిరూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పుతో ఆదివారం మధ్యాహ్నం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. ఈ గాలులకు కావలి పట్టణం ముసునూరు వికలాంగుల కాలనీలో 11 కేవీ విద్యుత్ స్తంభం విరిగి తీగల మోపున ఊగసాగింది. దీంతో ఒక్క సారిగా మంటలు చెలరేగి విద్యుత్ సరఫరా నిలిచిపో యింది. ఈ విషయాన్ని స్థానికులు విద్యుత్ ఏఈ శ్రీనివాసులురెడ్డి దృష్టికి తీసుకుపోవడంతో విద్యుత్ అధికారులు, సిబ్బంది అక్కడకు చేరుకుని విద్యుత్ స్తంభాన్ని తాళ్లతో కట్టారు. సోమవారం విరిగిన స్తంభాన్ని తొల గించి నూత న స్తంభం ఏర్పాటు చేస్తామని ఏఈ తెలిపారు.

కూలిన విద్యుత్ స్తంభాలు, చెట్లు

కొండాపురం : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఈదురు గాలులు బీభత్సం ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాయి. కొమ్మి సబ్‌స్టేషన్ నుంచి సత్యవోలుకు విద్యుత్ సరఫరాకు సంబంధించి 11కేవీ లైను రెండు స్తంభాలతోపాటు పంచాయతీలోని లింగనపాలెంలో మూడు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఆ సమయంలో విద్యుత్ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పలు గ్రామాల్లో చెట్లు నేలకొరిగాయి. గడ్డి వాములు సైతం పడిపోయాయి. ట్రాన్స్‌కో సిబ్బంది స్తంభాలు పడిపోయినచోట్ల తాత్కాలిక మరమ్మతులుచేసి విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

చిరు జల్లులు

బిట్రగుంట : బోగోలు మండలంలో ఆది వారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం మారి ఆకాశం ఎర్రపడింది. ఉదయం నుంచి భానుడి తీవ్రతతో ఎండ కాసింది. 3 గంటల ప్రాంతంలో ఉరుములు, మెరుపులతో కూడిన బలమైన ఈదురు గాలులు వీశాయి. మబ్బులు కమ్ముకుని తేలిక పాటి వర్షం కురిసింది. క్షణాలో ఈదురు గాలులు తగ్గడం వాతావరణం యథావిధిగా మారింది.

లారీ ఢీకొని వృద్ధుడి మృతి


లారీ చక్రం కింద నలిగిన వృద్ధుడు రంగయ్య

కందుకూరు, మే 4(ఆంధ్రజ్యోతి): సైకిల్‌పై వెళ్తున్న నేరెళ్ల రంగయ్య (74) లారీ ఢీకొని మృతి చెందిన ఘటన ఆదివారం పట్టణంలోని పోస్టాఫీసు సెంటర్‌లో జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. మహదేవపురంకు చెందిన రంగయ్య సొంత పనిమీద సైకిల్‌పై కందుకూరు పట్టణంకు వచ్చాడు. పోస్టాఫీసు సెంటర్‌లో తన వెనుకే సింగరాయకొండ వైపు నుంచి వస్తున్న లారీని తప్పించుకోవడం కోసం పోస్టాఫీసు కార్నర్‌లో ఓ పక్క సైకిల్ ఆపుకుని నిల్చున్నాడు. అయితే లారీని డ్రైవర్ పోస్టాఫీసు సెంటర్‌లో పామూరు రోడ్డువైపు తిప్పేక్రమంలో రంగయ్యను గమనించకుండా వేగంగా తిప్పడంతో అతనిని ఢీకొనగా కాలుపై లారీ చక్రం ఎక్కింది. దీంతో తీవ్ర గాయాలైన రంగయ్యను చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించగా అక్కడ మృతి చెందాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జలదంకి మండల వైసీపీ అధక్షుడిగా ఇస్కా


ఇస్కా మదన్‌మోహన్ రెడ్డి

జలదంకి, మే 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల అధ్యక్షుడిగా కావలి ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఇస్కా వెంకట్రామిరెడ్డి కుమారుడు ఇస్కా మదన్‌మోహన్‌రెడి నియమితులయ్యారు. ఆ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదివారం ఆదేశాలు అందాయి. కొంతకాలం క్రితం వైసీపీ మండల కన్వీనర్ పాలవల్లి మాలకొండారెడ్డి వ్యక్తిగత కారణాలతో పదవికి రాజీనామా చేసి సాధారణ సభ్యుడిగా కొనసాగుతున్నారు. దీంతో వైసీపీ నియోజకవర్గ ఇంచార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఇస్కా మదన్‌మోహన్ రెడ్డి పేరు సిఫార్సు చేశారు. ఆయన నియామకంతో కేడర్‌లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతోన్నారు.

అట్టల ఫ్యాక్టరీ వద్ద మంటలు


అట్టల ఫ్యాక్టరీ వద్ద మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కావలి రూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం ముసునూరు ఇందిరమ్మ కాలనీలోని అట్టల ఫ్యాక్టరీ పక్కన నిల్వ చేసిన చెత్తకు ఆదివా రం మంటలు అంటుకున్నాయి. వాతావరణ మార్పులతో వీచిన గాలుల కు ఆ ప్రాంతంలో మంటలతో పాటు దట్టమైన పొగ కమ్ముకుంది. దిగువ న ఉన్న గిరిజన కాలనీ వాసులు ఈ పొగ దెబ్బకు ఉక్కిరి బిక్కిరి అయ్యారు. గాలికి తగలబడుతున్న ప్లాస్టిక్ కవర్ల వ్యర్థాలు ఎక్కడ తమ ఇళ్లపై పడుతాయో నని భయాందోళన చెందుతూ ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ఇంచార్జి ఫైర్ ఆఫీసర్ జీ.ప్రభాకర్, ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు వ్యాప్తి చెందకుండా ఆర్పివేశారు. గిరిజన కాలనీకి ఆనుకుని నివాసాల మధ్యన అట్టల ఫ్యాక్టరీ ఉన్నప్పటికీ దాని చుట్టూ ప్రహరీ లేక పోవడంతో పాటు అట్టల తయారీకి సేకరించిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు మాత్రం రోడ్డుపై నిల్వ చేస్తున్నారు. ఈ విషయంపై అనేక మార్లు ఫిర్యాదు చేసి ఏస్టీ కమిషన్ దృష్టికి తీసుకు పోవడంతో పొల్యూష న్ బోర్డు అధికారులు పరిశీలించి వెళ్లారు తప్ప దానిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని గిరిజనులు వాపోతున్నారు.

సీతారాములకు 16 రోజుల పండుగ

బిట్రగుంట, మే 4(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరులో వెలసి ఉన్న కోదండరామాలయంలో సీతారాముల కల్యాణ అనంతరం ఆదివారం 16 రోజుల పండుగ వేడుకలు జరిగాయి. ఉదయం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేక పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్ప కార్యక్రమం జరిగింది. రాత్రి సీతారాముల పల్లకీ సేవ, పూల అలంకరణ కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

చలివేంద్రం ప్రారంభించిన ఇంటూరి


మజ్జిగ అందజేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, మే 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పామూరు బస్టాండ్ ఎన్టీఆర్ కూడలి సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. దాతలు ఏర్పాటు చేసిన మజ్జిగను ఆయన ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటుకు పట్టణ టీడీపీ నాయకులు ముందుకురావటం అభినందనీయమని, భవిష్యత్తులో పార్టీ నాయకులు మరిన్ని సేవాకార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, ముచ్చు శ్రీను, చిలకపాటి మధుబాబు, షేక్ రఫీ, బెజవాడ ప్రసాదు, వడ్డెళ్ల రవిచంద్ర, అత్తంటి శ్రీహరినాయుడు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దత్తాత్రేయస్వామి ఆరాధన


దత్తాత్రేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

లింగసముద్రం, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిలిచెర్లలోని దత్తాత్రేయస్వామి ఆరాధన మహోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఉదయం నుంచే స్వామి వారిని దర్శించుకొనేందుకు భక్తులు క్యూ లైన్లలో బారులు తీరారు. స్వామి వారి దర్శనార్థం నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచే కాక పలు ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తమ కోర్కెలు తీర్చిన స్వామి వారిని భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్, ఆలయ సిబ్బంది తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి దత్త స్వాములచే పండరి భజన, హరిశ్చంద్ర నాటక ప్రదర్శన, అగ్నిగుండ ప్రవేశం జరిగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గుడ్లూరు సీఐ మంగారావు, ఎస్‌ఐలు ఎం.నారాయణ, వెంకట్రావు పర్యవేక్షించారు.

ఆంజనేయస్వామి విగ్రహం, ధ్వజస్తంభం ప్రతిష్ఠ


ఆంజనేయ విగ్రహప్రతిష్ఠ అనంతరం ప్రతిష్ఠిస్తున్న ధ్వజస్తంభం

జలదంకి, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టుపల్లి పంచాయతీ చింతలపాలెంలోని రామాలయంలో రెండేళ్ల క్రితం పెనుగాలులకు ధ్వజస్తంభం నేలకొరగగా దాని స్థానంలో జీవ ధ్వజస్తంభాన్ని ఆదివారం ప్రతిష్ఠించారు. దీనితో పాటు ఆలయ ప్రాంగణంలో ఆంజనేయ స్వామి భారీ విగ్రహాన్ని వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ప్రతిష్ఠించారు. ఈ రెండు ఘట్టాలను తిలకించేందుకు గ్రాస్థులతో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం రామనామ స్మరణతో మార్మోగింది. అనంతరం సీతారాముల కల్యాణం నిర్వహించారు. భక్తులు అన్న ప్రసాద వితర చేశారు. ఈ కార్యక్రమాలకు ఉదయగిరి, కావలి ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, దగుమాటి వెంకటకృష్ణారెడ్డిలు హాజరు కాగా వేదపండితులు పూర్ణకుంభంతో ఆహ్వానించి స్వామి దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమాలు కావలి పట్టణంలోని హనుమాత్ క్షేత్ర వ్యవస్థాపకుడు వేదగిరి సూర్యనారాయణచార్యుల బృందం నిర్వహించింది. ఈ కార్యక్రమాల్లో దేవస్థాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు ఇందిరమ్మ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం


ఇందిరమ్మ కాలనీలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు

కావలి, మే 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ వాసుల దశాబ్దాల కల ఎట్టకేలకు నెరవేరుతోంది. పేదలు నివశించే ఈ ప్రాంతంలో రోడ్లు లేక ముఖ్యంగా వర్షాకాలంలో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ విషయం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వెంగళరావునగర్ కొత్త శివాలయం నుంచి ఇందిరమ్మ కాలనీ వరకు సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.1.6 కోట్ల మంజూరు చేయించారు. ఈ నిధులతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు. ట్రంకు రోడ్డు నుంచి ఇందిరమ్మ కాలనీకి వచ్చేందుకు కావ్య ఎస్టేట్‌లో నుంచి రామమేంద్రస్వామి ఆలయం వద్ద రైల్వే అండర్ పాస్ నిర్మాణం కూడా చేపడుతున్నారు. అండర్ పాస్ నిర్మాణం నుంచి ఆ రోడ్డు నేరుగా ఇందిరమ్మ కాలనీ వరకు వేసే విధంగా ప్రతిపాదనలు పంపి ఉన్నారు. ఆ ప్రతిపాదనల రోడ్డు కనెక్టివిటీ వరకు ప్రస్తుతం సీసీ రోడ్డు నిర్మాణం జరుగుతోంది. అది పూర్తి అయితే ఇందిరమ్మ కాలనీ ప్రాంతంలో రోడ్డు సమస్య పరిష్కారం అవుతోంది.

చెట్టును ఢీకొన్న మోటారు సైకిల్

- తల్లీకూతుళ్లకు తీవ్ర గాయాలు

లింగసముద్రం, మే 4 (ఆంధ్రజ్యోతి) : దైవ దర్శనానికి వెళుతున్న ఓ కుటుంబం ప్రమాదానికి గురై ఆస్పత్రి పాలైంది. వివరాల మేరకు.. వలేటివారిపాలెం మండలం బంగారక్కపాలెంకు చెందిన గోసు అనూష, తన ఇద్దరి పిల్లలతో కలసి తన బంధువైన ఓ యువకుడితో మోటారు సైకిల్‌పై ఆదివారం రాత్రి 7.30 గంటల సమయంలో మండలంలోని మొగిలిచెర్ల దత్తాత్రేయ స్వామి ఆలయంలో ఆరాధన మహోత్సవానికి బయలుదేరారు. ఆర్ఆర్ పాలెం బస్టాండ్ సమీపంలోని మలుపు వద్ద మోటారుసైకిల్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. దీంతో అందరూ కిదపడగా అనూషకు, ఆమె కుమార్తె జయశ్రీకి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న 108కి అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేటు వైద్యశాలకు వెళ్లినట్లు 108 సిబ్బంది తెలిపారు.

సిద్దీపురంలో రక్తదాన శిబిరం

సంగం, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దీపురంలో యువనేస్తం సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతం అయింది. మొదట ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గ్రామ యువకుడు, వైద్య విద్యార్థి గుండాల జీవన్ చంద్రారెడ్డికి నివాళులు అర్పించారు. అనంతరం యువనేస్తం సేవా ఫౌండేషన్ సభ్యులు చంద్రకాంత్, నాయబ్ రసూల్ ఆధ్వర్యంలో యువకులు రక్తదానం చేశారు. నెల్లూరు ఇండియన్ రెడ్‌క్రాస్ నిర్వాహకులు పాల్గొని యువకుల నుండి రక్తం సేకరించారు. ఈ రక్తదాన శిబిరంలో పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

ప్రకృతి వ్యవసాయంతోనే సంపూర్ణ ఆరోగ్యం

సీతారామపురం ,మే 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పబ్బులేటిపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ మోడల్ మేకర్ మల్లెల సురేష్, యూనిట్ ఇన్‌చార్జి మాలిబాబు ఆధ్వర్యంలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ 2025 - 26లో భాగంగా రైతులు, మహిళా సభ్యులతో కలిసి గ్రామాల్లో ఆదివారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నెమ్మలదిన్నె సర్పంచ్ రామచంద్రయ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, లక్ష్మీ ప్రశాంతి, పద్మ పాల్గొన్నారు.

పది, ఇంటర్ ప్రతిభావంతులకు పురస్కారాలు

కావలిటౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పురస్కారాలు అందజేశారు. బాపూజీనగర్‌లోని సంఘం కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలుగు సాహితీవేత్త అన్నదాత మణి పాల్గొని విద్యార్థులను శాలువాలతో సత్కరించి నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తటవర్తి రమేష్, శిరీష దంపతులు, సంఘం కార్యదర్శి ఓరుగంటి రామకృష్ణ, విట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సునీల్, తదితరుల పాల్గొన్నారు.

అంకాళమ్మ ఆలయ అభివృద్ధికి సహకరిస్తా

- విగ్రహ ప్రతిష్ఠోత్సవంలో మంత్రి ఆనం


పూజలు నిర్వహిస్తున్న మంత్రి ఆనం, ఎంపీ వేమిరెడ్డి తదితరులు

వరికుంటపాడు (ఆంధ్రజ్యోతి), మే 4 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు-ప్రకాశం జిల్లాల నడుమ పెద్దిరెడ్డిపల్లిలో నిర్మించిన అంకాళమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి తనవంతుగా సహకరిస్తానని రాష్ట్ర దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేక ఉత్సవాలకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఎమ్మెల్యే చేసిన ప్రతిపాదనలను ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లి నిధులు సమకూర్చేందుకు ఏర్పాట్లు చేస్తానన్నారు. అలాగే ఆలయ నిర్మాణ దాతలు కోరిన విధంగా తాము కూడా మరికొంత నగదును సమకూర్చేందుకు నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. తొలుత వరికుంటపాడులోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ వ్యవస్థాపకుడు పెండ్యాల సూర్యనారాయణ ఘనంగా సన్మానించి స్వామివారి చిత్రపటాలను అందజేశారు. అలాగే ధర్మ వరం గ్రామంలో తెలు గు యువత అధ్యక్షుడు ముజ్జె లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామంలోని ఎన్టీఆర్, ఛత్రపతి శివాజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు, మాజీ జడ్పీ ఛైర్మన్ చెంచలబాబు యాదవ్, జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, యూనిట్ ఇన్‌చార్జి నాదిళ్ల రాజేంద్ర పాల్గొన్నారు.

వాటర్ ప్లాంటు ప్రారంభం

మండలంలోని పెద్దిరెడ్డిపల్లిలో ఆదివారం వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన వీపీఆర్ అమృతధార తాగునీటి పథకాన్ని దేవదాయ శాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి బిందెలతో నీరు పట్టి మహిళలకు అందజేశారు.

● వింజమూరు: మండల కేంద్రంలోని బొమ్మరాజు చెరువు సమీపంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయానికి ఆదివారం పార్టీ ప్రముఖులు విచ్చేశారు. అంకాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి వెళ్లే క్రమంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, కంచర్ల శ్రీకాంత్ పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. వారందరికీ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఘన స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు. వీరితోపాటు మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ పొన్నుబోయిన చెంచలబాబుయాదవ్, రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, మాజీ పోలీస్ హౌసింగ్ సొసైటీ ఛైర్మన్ మెట్టుకూరి చిరంజీవి రెడ్డి, పొలిటికల్ మేనేజర్ మాలేపాటి చైతన్య, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, కలిగిరి మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంగంలో చిరుజల్లులు

సంగం, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

వింజమూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం చిత్రలేఖనంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ శాఖ అధికారి జ్యోతికొండయ్య, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు వెంగమాంబ సన్నిధిలో టెండర్ల నిర్వహణ

దుత్తలూరు (ఉదయగిరి), మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ గ్రామంలో ఉన్న వెంగమాంబ పేరంటాలమ్మ బ్రహ్మోత్సవాలు జూన్ 15 నుంచి 19వ తేదీ వరకు జరుగనుండడంతో భక్తుల సౌకర్యార్థం వివిధ ఏర్పాట్లపై ఆలయ ఆవరణలో సోమవారం టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి వెట్టిగుంట ఉషశ్రీ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగలవారు ఈ టెండర్లలో పాల్గొనాలని ఆమె కోరారు.

హిందూ ధర్మ పరిక్షణ కోసం పాదయాత్ర


ఉదయగిరికి చేరిన లక్ష్మీపతిస్వామిజీ పాదయాత్ర

ఉదయగిరి, మే 4 (ఆంధ్రజ్యోతి): హిందూ సనాతన ధర్మంపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు పరిక్షణకై పాదయాత్ర చేపడుతున్నట్లు లక్ష్మీపతిస్వామిజీ పేర్కొన్నారు. నవంబరు 1 2016లో కర్ణాటక రాష్ట్రం ఉడిపిలో చేపట్టిన పాదయాత్ర ఆదివారం ఉదయగిరికి చేరుకొంది. స్థానిక విశ్వ హిందూ పరిషత్ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లక్ష్మీపతిస్వామిజీ విలేఖరులతో మాట్లాడుతూ సనాతన ధర్మంపై ప్రచారం చేస్తూ పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. కర్ణాటక, తెలంగాణ, ఆంధ్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కేరళ రాష్ట్రాల మీదుగా అయోధ్యకు చేరుకుని శ్రీరాముని దర్శించుకున్నట్లు తెలిపారు. తిరిగి తన స్వగ్రామమైన ఉడిపికి వెళుతూ ఉదయగిరికి చేరుకున్నానన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు శ్రీనివాసరావు, విప్లవ్ కుమార్‌రెడ్డి, గురవయ్య, కార్తీక్ పాల్గొన్నారు.

మండలానికి పాఠ్య పుస్తకాల సరఫరా

సంగం, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలానికి ఆదివారం జిల్లా కేంద్రం నుంచి పాఠ్య పుస్తకాలు సరఫరా అయ్యాయి. వీటిని సంగం జిల్లా ఉన్నత పాఠశాలలోని కాంప్లెక్స్ కేంద్రంలో నిల్వచేశారు. అక్కడి నుంచి పాఠశాలలకు సరఫరా చేయనున్నారు. జూన్ నెల 12వ తేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. పాఠశాలల ప్రారంభం లోపు పాఠ్య పుస్తకాలు సరఫరా చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఆమేరకు ముందుగా పాఠ్య పుస్తకాలు సరఫరా చేస్తున్నారు. 90 శాతం పాఠ్య పుస్తకాలు సరఫరా అయినట్లు ఎంఈవో మల్లయ్య తెలిపారు. మిగిలిన పుస్తకాలు త్వరలో వస్తాయన్నారు.

సీతారాములకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో సీతారాములు

దుత్తలూరు (ఉదయగిరి), మ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమలరేగడ గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామ దేవస్థానంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారంతో వైభవంగా ముగిసాయి. ఈసందర్భంగా వేద పండితులు స్వామివార్లకు మహా కుంభాభిషేకం, తదితర పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. గ్రామంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివార్లకు కాయాకర్పూరం అందజేసి తీర్థప్రసాదాలు స్వీకరించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఘనంగా కోదండరాముడి కల్యాణం

సంగం: మండలంలోని జంగాలకండ్రికలో ఉన్న కోదండరామస్వామి ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా శనివారం అర్ధరాత్రి స్వామివారి కల్యాణం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను అలంకరించి కల్యాణ వేదిక మీదకు చేర్చి మంగళవాయిద్యాల నడుమ కల్యాణం వైభవంగా జరిగింది.

నాగారపమ్మకు పూజలు

సంగం, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న నాగారపమ్మదేవి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించారు. మహిళలు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా దాసరి

అల్లూరు, మే 4(ఆంధ్రజ్యోతి): జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా జనసేన ఎస్టీసెల్ నాయకుడు దాసరి పోలయ్య ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టరు ఓ ఆనంద్ ప్రకటించినట్లు ఆదివారం తెలిపారు. దీంతో అల్లూరు పాతబస్టాండు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

35 ఏళ్లకు టెన్త్ పాస్

● ఆదర్శంగా నిలుస్తున్న రైల్వే స్వీపర్


టెన్త్‌లో ఉత్తీర్ణత సాధించిన ప్రభావతి

నెల్లూరు(విద్య), మే 4 (ఆంధ్రజ్యోతి) : పుట్టింది నిరుపేద కుటుంబం....అయితేనేం ఆమె ఆశయం ఎంతో ఉన్నతమైనది...చిన్నతనం నుంచి చదువుపై మక్కువ ఉన్నా నాలుగవ తరగతి వరకే చదువుకుని కుటుంబ ఆర్థిక పరిస్థితులు, పేదరికం కారణంగా చదువుకోలేక పోయింది. అయినా ఆమె పట్టుదల మాత్రం వీడలేదు. ఎట్టకేలకు 35 ఏళ్ల వయసులో టెన్త్ పబ్లిక్ పరీక్షలు రాసి పాసయ్యింది. ఆమే నెల్లూరులోని వేదాయపాళెం రైల్వే స్టేషన్‌లో స్వీపర్‌గా పనిచేస్తున్న శేషం ప్రభావతి. ఆమె స్థానిక ఇళ్లలో పనిమనిషిగా జీవనం సాగిస్తూనే ఓపెన్‌స్కూల్ పదో తరగతి పరీక్షలకు హాజరై ఉత్తీర్ణత సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచింది. వివరాలు ఇలా ఉన్నాయి. సైదాపురం మండలం మర్లపూడి గ్రామానికి చెందిన ప్రభావతికి చిన్నతనం నుంచి విద్యపై ఎంతో మక్కువ. తల్లిదండ్రులు పార్వతమ్మ, లక్ష్మయ్య వ్యవసాయ కూలీలు. వారికి నలుగురు పిల్లలు. అందరినీ చదివించే ఆర్థిక స్తోమత లేకపోవడంతో పిల్లలు కూడా ప్రాథమిక విద్య అనంతరం తల్లిదండ్రుల్లాగే కూలీలుగా మారిపోయారు. అయినా సరే ప్రభావతిలో మాత్రం విద్యపై ఉన్న ఆసక్తి మాత్రం పోలేదు. వేదాయపాళెంలోని ఇళ్లలో పాచిపనులు చేస్తుండగా అక్కడ పరిచయమైన ప్రభుత్వ ప్రధానోపాధ్యాయురాలు బాల నాగమ్మ, వర్సిటీ ఉద్యోగిని కిరణ్మయి, బ్యాంకు ఉద్యోగిని నాగలక్ష్మితోపాటు స్టేషన్ ఎస్ఎస్ మునిబాబుకు తనకు చదువుపై ఉన్న ఆసక్తిని తెలియచేసింది. దీంతో వారు ప్రభావతిని ప్రోత్సహించారు. ఆమె ఓపెన్‌స్కూల్ ద్వారా పదో తరగతికి సన్నద్ధమైంది. రోజూ తన పనులు చేసుకుంటూనే నాలుగు గంటలు చదువుకు కేటాయించింది. దీంతో టెన్త్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి అందరితో శభాష్ అనిపించుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ తొలుత తనను అందరూ హేళన చేసినా తనకున్న ఆసక్తిని గమనించి ప్రోత్సహించారని చెప్పింది. ఇదే ఉత్సాహంతో ఇంటర్, డిగ్రీ కూడా పూర్తి చేస్తానని తెలిపింది.

నూర్‌బాషా విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

నెల్లూరు (హరనాథపురం), మే 4 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల విడుదలైన ఇంటర్, పదో తరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన నూర్‌బాషా సామాజిక వర్గం విద్యార్థుల కు ప్రతిభ ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని నూర్‌బాషా సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ సలీం చెప్పారు. ఆదివా రం నగరంలోని శాంతినగర్‌లో సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఆయన మా ట్లాడుతూ పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనపరిచిన వారికి రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు సహకారంతో బీఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ తరఫున ప్రోత్సాహక బహు మతులు అందజేస్తామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 500, ఇంటర్మీడియట్‌లో 900లకు పైబడిన మార్కులు సాధించిన వారి వివరాలను ఈ నెలాఖరులోపు అందజేయాలని అడిగారు. వాటిని పరిశీలించి బహుమతుల ప్రదానోత్సవ తేదీని ప్రకటిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షుడు షేక్ మహబూబ్‌బాషా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ హుస్సేన్‌సాహెబ్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ షేక్ మస్తాన్ సాహెబ్, జిల్లా ప్రధాన కార్యద ర్శి షేక్ మీరాసాహెబ్, నగర ప్రధాన కార్యద ర్శి షేక్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

చేతుల శుభ్రతే ఆరోగ్యానికి రక్ష

● నేడు ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం

ప్రధానంగా చేతుల పరిశుభ్రతపైనే మన ఆరోగ్యం ఆధారపడి ఉంది. ఇది తెలియక, అశ్రద్ధ వల్ల ఎంతో మంది అనారోగ్యం బారిన పడుతున్నారు. ఆహారం తినే ముందు, మల విసర్జన తర్వాత చేతులు పరిశుభ్రంగా కడుక్కోకపోవడంతో అనేక వ్యాధులు సోకుతు న్నాయి. ముఖ్యంగా టైఫాయిడ్, అతిసార, కలరా, బంక విరేచనాలు, ఫంగస్ వ్యాధులు సంక్రమిస్తున్నాయి. ఇవి అంటురోగాలుగా మారి ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తూ తీవ్ర అనారోగ్యానికి గురి చేస్తున్నాయి. ఒక్కోసారి ఇవి ప్రాణాంతకంగానూ మారుతున్నా యి. కేవలం చేతులు సబ్బుతో శుభ్రపరుచుకోకపోవడం వల్ల జిల్లాలో కొన్ని మరణాలు కూడా వెలుగు చూశాయంటే చేతుల శుభ్రత ఎంత ముఖ్యమో అర్థమవుతుంది.



● అనేక వ్యాధులకు నిలయాలు చేతులే !
● పరిశుభ్రతపై శ్రద్ధ చూపాలి
● లేకపోతే ప్రాణాంతక వ్యాధులకు అవకాశం

నెల్లూరు (వైద్యం), మే 4 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం నమోదవుతున్న రోగాలలో 60 శాతం చేతుల అపరిశుభ్రత వల్లేనని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ధారించింది. అపరిశుభ్రమైన చేతితో ఆహారం తినడం వల్ల ఆయా చేతులలో ఉన్న బ్యాక్టీరియా, బ్యాక్టీరియా గుడ్లు కడుపులోకి వెళ్లి వ్యాధులు కలుగజేస్తున్నాయి ప్రత్యేకించి చిన్నపిల్లల విషయంలో మట్టిలో ఆడుకున్న తర్వాత చేతులు పరిశుభ్రత పాటించకపోవటం వల్ల అనేక వ్యాధులతో అల్లాడుతున్నారు. అయితే చేతుల పరిశుభ్రతపై పేదలు, నిరక్షరాస్యులకు, బాలబాలికలకు అవగాహన కల్పించడంలో యంత్రాంగం పూరిస్థాయిలో చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలున్నాయి. ప్రతీ పాఠశాలల్లో విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై శిక్షణ ఇవ్వాల్సి ఉండగా, ఆ దిశగా కసరత్తు జరగడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి. స్వచ్ఛభారత్ - స్వచ్ఛ ఆంధ్ర వంటి కార్యక్రమాలు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో పరిసరాలతోపాటు చేతుల పరిశుభ్రతపై కూడా ఉవ్వెత్తున చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉంది.

నిర్లక్ష్యం వల్ల అనేక వ్యాధులు

మన నిర్లక్ష్యమే రోగాలకు ప్రధాన కారణం. చేతుల పరిశుభ్రతతో ఆరోగ్యాన్ని కాపాడు కోవచ్చు. దిన చర్యలో భాగంగా చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. ఆహారం తినే ముందు తప్పనిసరిగా చేతులను సబ్బుతో కడగాలి. తద్వారా క్రిములు కడుపులోకి పోకుం డా ఆపుకోవచ్చు. లేదంటే ఈ క్రిములు ఊపిరితిత్తుల్లోకి చేరి శ్వాసకోశ వ్యాధులకు దారితీస్తాయి. ఈ విషయాన్ని తల్లిదండ్రులు పిల్లలకు చిన్నప్పటి నుంచే అలవాటు చేయాలి.

- డాక్టర్ గంగాధర్, జీజీహెచ్ జనరల్ ఫిజీషియన్, అసోసియేట్ ప్రొఫెసర్



చేతులు కడగడం ఎలా...?

- ఆహారం తినే ముందు, మల విసర్జన తరువాత, ధూమపానం, జంతువుల నిర్వహణ అనంతరం తప్పనిసరిగా చేతులు కడుక్కోవాలి.
- వేడి నీటితోగానీ, చల్లటి నీటితోగానీ మణికట్టు వరకు చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలి.
- వేళ్ల మధ్య, వేలి గోళ్ల కింద, మోచేతులు, మణికట్టు వెనుక భాగంలోనూ సబ్బుతో బాగా రుద్ది నీటితో కడగాలి.
- అనంతరం పొడి వస్త్రంతో తుడుచుకోవాలి.

పైలాన్ ధ్వంసం కేసులో నలుగురి అరెస్ట్

కావలి రూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలోని కచ్చేరిమిట్ట రోడ్డులో నిర్మించిన అమృత పథకం పైలాన్‌ను ధ్వంసం చేసిన కేసులో ఆదివారం రెండవ పట్టణ పోలీసులు నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ గిరిబాబు కథనం మేరకు.. 2020 ఏప్రిల్ 11వ తేదీన పైలాన్‌ను కూల్చివేశారని అప్పటి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో 12 మంది నిందితులను గుర్తించగా వారిలో ప్రస్తుతం కుర్రు శ్రీనివాసులు, బెహరా లక్ష్మీనారాయణ, కేధారి కొండయ్య, వాజెంబాడి ప్రసాద్‌లను పట్టణంలోని వెంగళరావునగర్ బోర్డు వద్ద అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించారు. మిగిలిన వారిని కూడా త్వరలో అరెస్టు చేస్తామని సీఐ తెలిపారు.

ఆటోను ఢీకొన్న గుర్తుతెలియని వాహనం

● ఇద్దరికి తీవ్ర గాయాలు

వెంకటాచలం, మే 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సర్వేపల్లి క్రాస్‌రోడ్డులోని జాతీయ రహదారిపై శనివా రం అర్ధరాత్రి ఆటోను ఆటోను గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు గాయప డ్డారు. వివరాలిలా ఉన్నాయి. కసుమూరు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ సాయి, ఫక్రుద్దీన్ లిద్దరూ కలిసి నెల్లూరు నుంచి ఆటోలో గ్రామానికి వస్తున్నారు. అయితే సర్వేపల్లి క్రాస్ రోడ్డు దాటుతుండగా గూడూరు నుంచి నెల్లూరు వైపుగా వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో ఆటో ముందు భాగం దెబ్బతిన్నది. క్షతగాత్రులను 108 వాహనంలో నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


దెబ్బతిన్న ఆటో

కలెక్టరేట్‌లో భగీరథ జయంతి

● అంజలి ఘటించిన డీఆర్వో, తదితరులు

నెల్లూరు (హరనాథపురం), మే 4 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో ఆదివారం జిల్లా బీసీ సంక్షేమ అధికారి వెంకట లక్ష్మమ్మ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతి కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా జిల్లా రెవెన్యూ అధికారి ఉదయభాస్కర్ రావు హాజరై భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మహర్షి జీవిత చరిత్రను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు శీనయ్య, ఎం చంద్రశేఖర్, ఎం రామకృష్ణ, బీసీ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.


భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాల వేసిన నివాళులర్పిస్తున్న డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, అధికారులు

సోమశిల నీటిమట్టం

అనంతసాగరం మే 4 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ఆదివారం నాటికి 50.884 టీఎసీంలు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 30, దక్షిణ కాలువకు 50, డెల్టాకు 1000 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

నేడు బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), మే 4 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని వీఆర్ హైస్కూల్ క్రీడా మైదానంలో సోమవారం సాయంత్రం 5 గంటలకు సబ్ జూనియర్స్ బాల, బాలికల బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి గాదం వాసు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2012 జనవరి 1 తర్వాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు వయసు ధ్రువీకరణ పత్రాలతో ఎంపికలకు హాజరు కావాలని కోరారు.

నెల్లూరులో మళ్లీ రక్తపాతం

● మహిళపై రౌడీషీటర్ కత్తితో దాడి
● చికిత్స పొందుతూ మహిళ మృతి


మృతి చెందిన మాబునీ

నెల్లూరు(క్రైం), మే 4 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో రక్తపాతం ఆగడం లేదు. వరుసగా జరుగుతున్న హత్యలు, హత్యాయత్నాలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఈ అఘాయిత్యాల్లో రౌడీ షీటర్లు, నేర చరిత్ర కలిగిన వారు, వారితో తిరుగుతున్న వారి ప్రమేయమే అధికంగా ఉంటోంది. గడిచిన కొంత కాలంలో నగరంలో మగవారిపై వరుసగా హత్యలు, హత్యాయత్నాలు జరుగుతున్న విషయం తెలిసిందే. కానీ, శనివారం బుజబుజనెల్లూరులో మహిళపై లారీడ్రైవర్ కత్తితో విచక్షణ రహితంగా దాడి చేశాడు. తీవ్రంగా గాయపడ్డ ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. కొత్తగా మహిళలపై కత్తులతో దాడి చేసే సంస్కృతి నగరంలో మొదలైంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

చికిత్స పొందుతూ మహిళ మృతి

బుజబుజ నెల్లూరు పరిధిలోని చెన్నకేశవులు నగర్‌లో సయ్యద్ మాబునీ(33), గౌస్‌బాషా దంపతులు నివసిస్తున్నారు. వారికి ఇద్దరు పిల్లలున్నారు. అదే ప్రాంతానికి చెందిన బీ విజయ్ అనే లారీ డ్రైవర్ తరచూ మద్యం సేవించి ఆ మత్తులో అల్లర్లు చేసేవాడు. ఆయనపై వేదాయపాలెం పోలీసు స్టేషన్‌లో పలు కేసులున్నాయి. శనివారం సాయంత్రం మాబునీ పిల్లలు స్నేహితులతో ఆడుకుంటుండగా విజయ్ వారిని అసభ్య పదజాలంతో దూషించాడు. వారు భయపడి ఇంటికి వెళ్లారు. వారిని వెంబడిస్తూ వెళ్లిన విజయ్ ఇంటికి వెళ్లి గొడవ చేశాడు. దీంతో మాబునీ అతని ఇంటికి వెళ్లి తన పిల్లలను ఎందుకు దూషించావంటూ నిలదీసింది. దీంతో ఆవేశంతో ఊగిపోతూ విజయ్ తన వద్దనున్న కత్తితో ఆమెపై దాడి చేసి మూడు చోట్ల బలంగా పొడిచాడు. తీవ్రగాయాల పాలైన ఆమెను స్థానికులు చికిత్స నిమిత్తం కిమ్స్ వైద్యశాలకు, అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం నారాయణ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ నుంచి కుటుంబ సభ్యులు చెన్నైకు తీసుకెళుతుండగా మార్గమధ్యలో మాబుని మృతిచెందింది. ఆమె తమ్ముడు ఇమామ్‌బాషా వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ రోశయ్య హత్యాయత్నం కేసును హత్య కేసుగా మార్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాండెడ్ ముసుగులో నకిలీ సిగరెట్లు

● మార్కెట్‌లో జోరుగా విక్రయాలు

పొదలకూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో నకిలీ సిగరెట్లు దందా జోరుగా కొనసాగుతోంది. గుట్టుచపుడు కాకుండా బ్రాండెడ్ ముసుగులో ఫేక్ సిగరెట్లు విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. వీటి తయారీ మొదట బిహార్, గుజరాత్, ఉత్తరప్రదేశ్‌తో పాటు మయన్మార్‌లో నకిలీ సిగరెట్లు పురుడు పోసుకున్నట్లు సమాచారం. అచ్చం బ్రాండెడ్ సిగరెట్లకు ఏ మాత్రం తీసిపోని విధంగా నకిలీ సిగరెట్లు చుట్టేస్తున్నారు. వీటిని బ్రాండెడ్ పెట్టెలో పెట్టి విక్రయిస్తుండడంతో వినియోగదారులు వీటిని గుర్తించలేక కొనుగోలు చేస్తున్నారు. నకిలీ సిగరెట్లను కొరియర్లు, భారీ వాహనాల్లో రవాణా చేస్తున్నారు. నిబంధనల ప్రకారం కొరియర్ సంస్థలు పార్శిల్ పంపే వారి వివరాలు, అందులో ఏ వస్తువు ఉందో తెలుసుకోవాలి. అయితే కొన్ని కొరియర్ సంస్థలు నిబంధన లను గాలికి వదిలేయడంతో ఫేక్ సిగరెట్లు హద్దులు దాటుతున్నాయి. తెల్లవారు జామున శివారు ప్రాంతాల్లోకి సరుకును తీసుకొస్తారు. అక్కడ నుంచి రిటైలర్లు, డీలర్లు ఆటోల్లో దుకాణాలకు తరలించుకుంటారు. సిగరెట్ల అక్రమ రవాణాను నిలువరించేందుకు పోలీసులు, జీఎస్టీ అధికారులు అప్పుడ ప్పుడు ప్రయత్నిస్తున్నా ఉపయోగం లేదు. సీజీఎస్టీ, కస్టమ్స్ అధికారులు సరుకు పట్టుకున్నపుడు చేసే హడావిడి కేసు దర్యాప్తులో చూపించడం లేదు. డ్రైవర్లు, కమిషన్ ఏజెంట్లను మాత్రమే అరెస్టు చేసి చేతులు దులుపుకుంటున్నారు. అసలు మాఫియా.. వెనకున్న కీలక నిందితులను పట్టుకోకపోవడం వల్లే దర్జాగా దందా సాగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి.

టీవోడీ టారిఫ్ ప్రకారం బిల్లింగ్

● విద్యుత్ ఎస్ఈ విజయన్



నెల్లూరు (జడ్పీ), మే 4 (ఆంధ్రజ్యోతి) : టీవోడీ (టైం ఆఫ్ డే) టారిఫ్ ప్రకారం బిల్లింగ్ జరగాలని విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ ఆదేశించారు. జిల్లాలోని విద్యుత్ శాఖ అధికారులతో ఆదివారం ఆయన ప్రత్యేక టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కేటగిరి 2, 3 సర్వీసులకు టీవోడీ వర్తిస్తుందని చెప్పారు. విద్యుత్ బిల్లుల చెల్లింపులలో వినియోగదారులు ఇబ్బందులు పడకుండా ఏపీఎస్పీడీసీఎల్ ప్రత్యేక చర్యలు తీసుకుందని తెలిపారు. ఈనెలలో నూతన విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. విద్యుత్ బిల్లులోనే చెల్లించాల్సిన మొత్తానికి క్యూఆర్ కోడ్‌ను జత చేశారని, దీంతో వినియోగదారులు ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం యాప్‌ల ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి విద్యుత్ బిల్లులను డిజిటల్ పేమెంట్ ద్వారా చెల్లించవచ్చని వివరించారు. రీడర్స్ కూడా క్యూఆర్ కోడ్ వచ్చేంతవరకు బిల్లును కట్ చేయవద్దని ఆదేశించారు. ఈనెలలో వచ్చిన కరెంట్ బిల్లులో సెక్యూరిటీ డిపాజిట్‌పై వడ్డీ ఇచ్చినట్లు తెలిపారు. వడ్డీ ఎంత వచ్చిందో కరెంటు బిల్లులో ఐఎస్‌డీ కాలమ్‌లో ఉంటుందన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో నోడల్ ఆఫీసర్ శేషాద్రి బాలచంద్ర, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

బుచ్చిరెడ్డిపాళెం, మే4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడకు చెందిన వెంకట రమణమ్మ (28)అనే గిరిజన మహిళ ఆదివారం సాయంత్రం ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ సంతోష్‌రెడ్డి వివరా ల మేరకు.. ఈమె ముస్లిం యువకుడితో రెండో వివాహం చేసుకుని కొన్నిరోజులుగా జొన్నవాడ గిరిజనకాలనీలోని అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. 4రోజులుగా భార్యభర్తల మధ్య తరచూ గొడవల నేప థ్యంలో మనస్తాపం చెంది ఇంట్లోనే ఉరేసుకుంది. ఈ మేరకు కేసు నమోదు చేసి భర్త కరిముల్లాను విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

● జొన్నవాడలో వృద్ధురాలి మృతి

జొన్నవాడ ఆలయ సమీపంలో డక్కిలి ప్రాంతానికి చెందిన మర్రిరెడ్డి రమాదేవి (61)అనే వృద్ధురాలు మృతి చెందింది. స్నానపు గదుల వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచు కందికట్టు పెంచలయ్య, పంచాయతీ, ఆలయ అధికారులు పరిశీలించి ఆధార్‌కా ర్డును చూసి బంధువులకు సమాచామివ్వగా వారు వచ్చి వృద్ధురాలి మృతదేహన్ని తీసుకెళ్లారు.

సౌత్‌జోన్ టెన్నిస్‌బాల్ క్రికెట్ విజేతలు ఆంధ్ర, తమిళనాడు


చాంపియన్‌గా నిలిచిన ఆంధ్రప్రదేశ్ బాలికల జట్టు

నెల్లూరు(విద్య), మే 4 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో రెండు రోజులపాటు జరిగిన సౌత్ అండర్-14 బాల, బాలికల టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీల్లో బాలికల విభాగంలో ఆంధ్రప్రదేశ్ జట్టు, బాలుర విభాగంలో తమిళనాడు జట్టు ఛాంపియ న్లుగా నిలిచాయి. ఫైనల్స్‌లో బాలికల విభాగంలో ఆంధ్రపదేశ్, తమిళనాడు జట్లు తలపడగా ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానం, తమిళనాడు ద్వితీయ స్థానం సాధించాయి. బాలుర విభాగంలోనూ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు జట్లు తలపడగా తమిళనాడు ప్రథమ స్థానం, ఆంధ్రప్రదేశ్ ద్వితీయ స్థానం సాధించాయి. ఎన్జీవో హోమ్‌లో జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో విన్నర్స్, రన్నర్స్‌కు బహుమ తులు అందచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టెన్నిస్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఆర్‌డీ ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు యుగంధర్, నిర్వా హక కార్యదర్శి అజయ్ కుమార్, ఉపాధ్యక్షుడు డాక్టర్ పిట్టి మల్లికార్జున, సభ్యులు మల్లిక, చరణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దుకాణం రేకులు పగులగొట్టి చోరీ


పగులగొట్టిన దుకాణం రేకులు


కొండాపురం, మే 4(ఆంధ్రజ్యోతి): దుకాణం పైకప్పు రేకులు పగులగొట్టి చోరీ చేసిన ఘటన శనివారం రాత్రి మండలంలోని భీమవరప్పాడులో జరిగింది. గ్రామానికి చెందిన మామిళ్ల పల్లి మాధవరావు స్థానిక బస్టాండు సెంటర్‌లో టీ, టిఫిన్, కూల్‌డ్రింక్స్, సిగరెట్లు దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజులాగానే శనివారం రాత్రి దుకాణం మూసివేసి ఇంటికివచ్చాడు. ఆదివారం ఉదయం దుకాణం షట్టర్ తెరవగా పైకప్పు రేకులు పగులగొట్టి ఉండటాన్ని గమనించారు. దుకాణంలోని గల్లాపెట్టెలో ఉన్న రూ.7 వేలతోపాటు రూ.18 వేల విలువైన శీతలపానియాలు, సిగరెట్లు అపహరించుకెళ్లినట్లు గుర్తించారు. ఈ మేరకు బాధితుడు మాధవరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బీచ్ కబడ్డీ విజేతగా నెల్లూరు జట్టు

● మహిళల విజేత కృష్ణా జట్టు ● కాకినాడ సాగరతీరంలో ముగిసిన పోటీలు

సర్పవరం జంక్షన్, మే 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సాగర తీరంలో మూడు రోజులు జరిగిన బీచ్ కబడ్డీ పోటీలు ఆద్యంతం అలరించాయి. అలల హోరు మధ్య కూతల మోతతో కాకినాడ సముద్ర తీరం మార్మోగింది. 'కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్, కాకినాడ జిల్లా కబడ్డీ అసోసియేషన్ సౌజన్యంతో కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో జరుగుతున్న 12వ అంతర జిల్లాల రాష్ట్ర బీచ్ కబడ్డీ చాంపియన్ షిప్- 2025 పోటీలు ఫైనల్‌కు చేరాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, అనపర్తి, అమలాపురం, కాకినాడ సిటీ ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అయితాబత్తుల ఆనందరావు, వనమాడి కొండబాబు, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి, ఇతర ప్రజా ప్రతినిధులు తిలకించారు.

చివరి రోజు మహిళల విభాగంలో చిత్తూరు-కృష్ణా జిల్లాల మధ్య హోరాహోరీగా జరిగిన ఫైనల్స్‌లో కృష్ణా జిల్లా జట్టు విజయం సాధించింది. పురుషుల విభాగంలో నెల్లూరు, ప్రకాశం జట్లు హోరాహోరీగా తలపడగా నెల్లూరు జట్టు చాంపియన్‌గా నిలిచింది. విజేతలకు మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు పంతం నానాజీ, జ్యోతుల నెహ్రూ, ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, ఎస్పీ బిందుమాధవ్ బహుమతులు ప్రదానం చేశారు.


పురుషుల చాంపియన్‌గా నిలిచిన నెల్లూరు జట్టు

పోలీసుల అదుపులో జేబుదొంగ

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మే 4 (ఆంధ్రజ్యోతి): సందెట్లో సడేమియా అన్న చందంగా తెలుగుదేశం పార్టీ కార్యక్రమాల్లో ఓ జేబుదొంగ తన చేతివాటం ప్రదర్శించి పట్టుబడిన సంఘటన ఆదివారం చోటుచేసు కుంది. వివరాలిలా ఉన్నాయి. మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో సహా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, ఉగ్రనరసింహారెడ్డిలు పెద్దిరెడ్డిపల్లిలో నిర్వహిస్తున్న అంకాళమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలకు వెళుతున్నారు. ఈనేపథ్యంలో మార్గమధ్యంలోని ధర్మవరంలో పలు కార్యక్రమాలను కొనసాగిస్తుండగా ఉదయగిరికి చెందిన పార్టీ నాయకుడు మట్ల లక్ష్మయ్య ప్యాంటు జేబులోని రూ. 20వేల నగదును ఓ జేబుదొంగ అపహరించే క్రమంలో కొంతమంది గమనించి పట్టుకున్నారు. అనంతరం దొంగను పోలీ సులకు అప్పగిం చడంతో పోలీ సు స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నట్లు ఎస్ఐ రఘునాథ్ తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	132
స్కిన్ చికెన్	234
స్కిన్‌లెస్	258

కోడిగుడ్ల ధర (100) : 480

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9018
వెండి కిలో ధర	రూ. 96,100
వెండి ఒక గ్రాము	రూ.99.10

విరాట్‌నగర్‌లో వైద్య శిబిరం

నెల్లూరు (సాంస్కృతికం), మే 4 (ఆంధ్రజ్యోతి) : జమాతే ఇస్లాం హింద్ ఆధ్వర్యంలో ఆదివారం విరాట్‌నగర్‌లో హాజీరా హాస్పిటల్ వారు వైద్య శిబిరం నిర్వహించారు. చెన్నై అపోలో ఆసుపత్రికి చెందిన డాక్టర్ నవాజ్ షరీఫ్ షేక్ రోగులకు ఎముకల పటుత్వం పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. నాయకులు, హాజీరా ఆసుపత్రి యాజమాన్యం డాక్టర్ నవాజ్ షరీఫ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ గౌరవాధ్యక్షుడు షేక్ మాలుల్లా, జమాతే ఇస్లామీ మాజీ అధ్యక్షుడు ఎం అన్వర్‌బేగ్, అబ్దుల్ ఖయ్యూం, ఎం షహాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పార్కులతోనే ఆహ్లాదం

రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ



పార్కులో పిల్లలతో కలిసి మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), మే 4 (ఆంధ్రజ్యోతి) : నగర వాసులకు పార్కులతోనే ఆహ్లాదం లభిస్తుందని, ఆ దిశగా నెల్లూరులో పచ్చదనంతోపాటు పార్కులను అందుబాటులోకి తీసుకువస్తున్నామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ఆదివారం 9వ డివిజన్ పరిధిలోని షాదీ మంజిల్ వద్ద ఆధునికీకరించిన పార్కును ప్రారంభించారు. చిన్నారులు ఆటవస్తువులు, పెద్దలు ఓపెన్ జిమ్‌ను వినియోగించుకోవడం పై ఆనందం వ్యక్తం చేశారు. పార్కుల వల్ల నగరానికి అందం వస్తుందని తెలిపారు. నిత్యం బిజీ జీవితంతో గడుపుతున్న నగర వాసులకు పార్కులు ఆహ్లాదాన్నిస్తాయని చెప్పారు. అనంతరం 11వ డివిజన్‌లోని ఈఎల్ఎస్ఆర్ పార్కును సందర్శించి వెంకటేశ్వర పురంలోని ఎన్టీఆర్ సుజల స్రవంతి తాగునీటి ప్లాంటును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఎన్ఎంసీ కమిషనర్ నందన్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

60 రోజుల్లో 339 పనుల పూర్తి



నెల్లూరు రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు రూ. 41 కోట్లతో తలపెట్టిన 339 అభివృద్ధి పనులను 60 రోజుల్లో పూర్తి చేశామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. శంకుస్థాపన జరిగిన రోజునే ఇచ్చిన మాట ప్రకారం ఈ అభివృద్ధి పనులన్నీటిని పూర్తి చేసినట్లు చెప్పారు. వాటికి ఈ నెల 15వ తేదీన 678 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ప్రారంభోత్సవాలు జరగనున్నాయని ప్రకటించారు. అదే రోజు ఉదయం 9 గంటలకు కల్లూరుపల్లిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర తోపాటు తాను ప్రారంభోత్సవాలలో పాల్గొంటానని చెప్పారు. కొండాయపాళెం గేటు, బీవీనగర్ రైల్వే గేట్ అండర్ బ్రిడ్జి పనులు త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. కాగా, రూరల్ నియోజకవర్గంలో రూ. 41 కోట్లతో 339 అభివృద్ధి పనులు 60 రోజుల్లో పూర్తి చేసినందుకు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఎక్స్ వేదికగా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన బృందాన్ని ప్రశంసించారు.

7న గాంధీనగర్ రోడ్డుకు శంకుస్థాపన : గిరిధర్‌రెడ్డి

నగరంలోని గాంధీనగర్ మెయిన్ రోడ్డుకు ఈ నెల 7వ తేదీన శంకుస్థాపన చేయనున్నట్లు టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లను ఆదివారం పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. రోడ్డు పనుల శంకుస్థాపనకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హాజరవుతారని చెప్పారు.

వీఆర్సీ మైదానంలో నవ్వుల దినోత్సవం

నెల్లూరు(విద్య), మే 4 (ఆంధ్రజ్యోతి) : వీఆర్సీ మైదానం వాకర్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆ మైదానంలో ఆదివారం ప్రపంచ నవ్వుల దినోత్సవం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు సుబ్బారెడ్డి మాట్లాడుతూ నిత్యం వాకింగ్, వ్యాయామంతోపాటు ఆరోగ్యంగా ఉండేలా నవ్వుల కార్యక్రమాలు నిర్వహిస్తుంటామని చెప్పారు. అనంతరం నవ్వుల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించి వాకర్స్‌ను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి షేక్ రియాజ్ అహ్మద్, క్లబ్ డైరక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు, యోగా మాస్టర్ వెంకురెడ్డి, టీవీ ఆర్టిస్ట్ శింగంశెట్టి మురళీమోహన్‌రావు, వివిధ సంఘాల నేతలు, సభ్యులు పాల్గొన్నారు.

హరిబాబుకు మహానంది పురస్కారం

నెల్లూరు (సాంస్కృతికం), మే 4 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా తెలుగు సంస్కృతి సాహితీ, మాచవరం సేవా సమితి సంయుక్తంగా హైదరాబాద్ త్యాగరాజ గానసభలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాయి. ఇందులో నెల్లూరుకు చెందిన నటుడు దోర్నాల హరిబాబుకు మహానంది పురస్కారం అందజేసింది. హరిబాబు రంగస్థలం, టీవీ, సినిమా రంగాల్లో హాస్యనటుడిగా గుర్తింపు పొందినందుకు పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాచవరం సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు గౌరీశంకర్, దైవజ్ఞ శర్మ, మురళీకృష్ణారెడ్డి వాఖ్యాత గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

● **జిల్లా గ్రంథాలయంలో...**

నగరంలోని జిల్లా గ్రంథాలయ సంస్థలో జరుగుతున్న వేసవి విజ్ఞాన సదస్సులో ఆదివారం ప్రపంచ నవ్వుల దినోత్సవం జరిగింది. అలాగే వరల్డ్ గివ్ డే జరిగింది. గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి కుమార్‌రాజా మాట్లాడుతూ నవ్వడం వలన కలిగే ఆరోగ్యాన్ని విద్యార్థులకు తెలిపారు. వరల్డ్ గివ్ దినోత్సవం విశిష్టతను వివరించారు. చిన్న చిన్న దానాలు పెద్ద మార్పు తీసుకువస్తాయని ప్రజాసైన్స్ వేదిక నగర అధ్యక్షుడు ఎం సతీష్‌కుమార్ తెలిపారు. బీపాజిటివ్ సుబ్బారావు ఇన్నోవేటివ్ క్విజ్ నిర్వహించారు. ఉపాధ్యాయుడు సునీల్, యోగా మాస్టర్ స్వప్న, డిప్యూటీ లైబ్రేరియన్ ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ

నెల్లూరు(విద్య), మే 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు పోబోలు సత్యనారాయణ, కార్యదర్శి సురేష్, మాజీ అధ్యక్షుడు వే లూరు రంగారావు, శేషగిరిరావు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

నెల్లూరు (హరనాథపురం) మే 4 (ఆంధ్రజ్యోతి) : కోవూరు నియోజకవర్గం పరిధిలోని ఆరుగురికి సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నగరంలోని తన నివాసంలో ఆదివారం అందజేశారు. 11 నెలల వ్యవధిలో 10 విడతలుగా 153 మంది అనారోగ్య పీడితులకు సహాయనిధి చెక్కులు అందజేస్తామని చెప్పారు. ప్రతీ పేదవాడికి మెరుగైన వైద్యం అందివ్వాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇంత మల్లారెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, మోర్ల మురళీ తదితరులు పాల్గొన్నారు.

టెక్నికల్ ఉద్యోగులుగా గుర్తించాలి : వార్డు కార్యదర్శులు

నెల్లూరు (హరనాథపురం), మే 4 (ఆంధ్రజ్యోతి) : తమను టెక్నికల్ ఉద్యోగులుగా గుర్తించి పదోన్నతి కల్పించాలని నెల్లూరు వార్డు ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ కార్యద ర్శు లు కోరారు. వారి ఆత్మీయ సమావేశం ఆదివారం నెల్లూరు నగరంలోని ఎన్జీవో హోమ్‌లో జరిగింది. ఉద్యోగ నోటిఫికేషన్‌లో పొందుపరిచిన విధంగా తమను టెక్నికల్ ఉద్యోగులుగా గుర్తించాలని, తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చలపతి శర్మ, ఏపీ జేఏసీ జిల్లా కన్వీనర్, ఏపీ ఎన్జీవో జిల్లా ప్రధాన కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బాలరాగయ్య, ఏపీ ఎన్జీవో సిటీ అధ్యక్షుడు రామకృష్ణా రెడ్డి, సంయుక్త కార్యదర్శి చెంచయ్య, తదితరులు పాల్గొని మద్దతు తెలిపారు.

25 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల అపురూప సమ్మేళనం



25 ఏళ్ల సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

నెల్లూరు(విద్య), మే 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రంగనాయకులపేట సెయింట్ పీటర్స్ అండ్ బిషప్ శౌరీ మెమోరియల్ పాఠశాలలో 2000 సంవత్సరంలో టెన్త్ చదివిన విద్యార్థులంతా ఆదివారం పాఠశాలలోని ఆడిటోరియం వేదికగా పూర్వ విద్యార్థుల సమ్మేళనంతో మళ్లీ ఏకమయ్యారు. నాటి జ్ఞాపకాలతో తడిసి ముద్దయ్యా రు. తీపి గుర్తులను జ్ఞప్తికి తెచ్చుకుంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. దశాబ్దాల తర్వాత స్నేహితులను కలుసుకోవడం మరిచిపోలేని అనుభూతిని ఇచ్చిందన్నారు. ఈ స్నేహం, బంధం ఇలానే కొనసాగాలంటూ తీర్మానం చేసుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులు సురేఖ, గౌసియా బేగం, నిర్మలతో కలిసి స్నేహితులందరూ ఆడి, పాడారు. అనంతరం గురువులను సత్కరించారు. పాఠశాలలో ప్రొజెక్టర్ ఏర్పాటు కు రూ.10వేలు విరాళంగా అందచేశారు. ము న్ముందు పాఠశాల ఉన్నతికి తమవంతు సహకారం అంది స్తామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో పూర్వవిద్యార్థుల సంఘం ప్రతినిధులు చిన్ని శ్రావణ్‌కుమార్, కళాంబి ఆదిత్య, గురు పవన్, మొహిద్‌హుస్సేన్, జీపీ కిషోర్, సువర్ణ మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ క్రీడాకారులకు పండ్ల పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న సహదేవయ్య

నెల్లూరు (సాంస్కృతికం), మే 4 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో జరుగుతున్న ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు నవజీవన్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కే సహదేవయ్య ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమానికి వైస్ చాన్సలర్ ఏ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ డాక్టర్ సునీతలు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నవజీవన్ ఆర్గనైజేషన్ సిబ్బంది కే పెంచలయ్య, ప్రభావతి, బాబులు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కృష్ణారెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ఎంపీ వీపీఆర్ ట్రై సైకిల్ వితరణ

ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆదివారం నగరంలోని ఆయన నివాసంలో నలుగురు దివ్యాంగులకు ట్రై సైకిళ్లను అందజేశారు. నడవలేక అవస్థపడే ప్రతీ ఒక్క దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేయడం వీపీఆర్ ఫౌండేషన్ లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేతంరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, బిజు వేముల ఓబుల్ రెడ్డి, కిషోర్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ లేక ప్రయాణికుల ఇక్కట్లు



బస్టాండ్ లేనినరుకూరు సెంటర్

తోటపల్లిగూడూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): అసలే వేసవికాలం. ఉష్ణోగ్రతలు చూస్తుంటే మండుతున్నాయి. ఇంట్లో నుంచి కాలు బయటపెట్టాలంటే భయమేస్తుంది. దూరప్రాంతాలు నుంచి మండలకేంద్రానికి రావాలంటే బస్టాండ్ లేక బస్సులు కోసం వేచి ఉండాల్సిన ప్రయాణికులకు నిలువ నీడలేక ఎండలోనే పడి గాపులు కాస్తున్నారు. మండల కేంద్రానికి, గ్రామాలకు వెళ్లాలంటే నరు కూరు సెంటర్ కూడలిగా ఉంది. బస్టాండ్ నిర్మాణం చేపట్టడంతో అధికారులు విఫలం అవుతున్నారు. చింతోపు, ఆములూరు, కొత్తపాలెం, కోడూరు, వెంకన్నపాలెం, మాచర్లవారిపాలెం, వరిగొండ, అనంతపురం, ఈదూరు, సీఎస్‌పురం గ్రామాలకు నరుకూరు సెంటర్ కూడలిగా ఉంది. బస్టాండు లేకపోవడంతో ఏ బస్సు ఎంత సమయానికి వస్తుందో కనీసం ఆర్టీసీ యాజమాన్యం బస్సు వేళల బోర్డు కూడా ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

ఆయకట్టులోని చివరి ఎకరానికి సాగునీరు

● సదరన్, ఈస్టర్న్ చానల్స్‌కు

కోవూరు ఎమ్మెల్యే నీటి విడుదల



క్రస్ట్‌గేట్లు ఎత్తి సాగునీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం,మే 4(ఆంధ్రజ్యోతి): కనిగిరి రిజర్వాయర్ ఆయకట్టు కింద చివరి ఎకరానికి సాగునీరు అందించేందుకు కృషి చేయాల్సిన బాధ్యత మీదేనంటూ ఇరిగేషన్ అధికారులు, సాగునీటి సంఘాల అధ్యక్షులతో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. నియో జకవర్గంలో ఖరీఫ్ రైతుల నారుమళ్ళ అవసరాలకు ఎమ్మెల్యే ఆదివారం బుచ్చిరెడ్డిపాళెంలో జోరు వర్షంలోనే కనిగిరి రిజర్వాయర్ క్రస్ట్‌గేట్లు ఎత్తి సదరన్, ఈస్టర్న్ చానల్స్‌కు సాగునీటిని విడుదల చేసి మాట్లాడారు. నీటివృథాను అరికట్టి సాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పెన్నాడెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ, ఏఈలు పెంచలయ్య, వెంకట ప్రసాద్, చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కౌన్సిలర్లు పుట్టా లక్ష్మీకాంతమ్మ, లలితమ్మ, తాళ్ల వైష్ణవి, చీర్ల ప్రసాద్, పలువురు నీటి సంఘం డైరెక్టర్లు, అధ్యక్షులు, బత్తల హరికృష్ణ, శేషయ్య, శివయ్య నాయుడు, యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

వెట్టిచాకిరీ నిర్మూలన కమిటీ సభ్యుడిగా వడ్లపూడి పాపయ్య



నియామక ఉత్వర్వులు అందుకుంటున్న పాపయ్య

కోవూరు, మే 4 (ఆంధ్రజ్యోతి) :వెట్టిచాకిరీ నిర్మూలనకు జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా కోవూరు రిటైర్డు ఉపాధ్యాయుడు వడ్లపూడి పాపయ్యను నియమిస్తూ కలెక్టరు ఆ నందబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ప ట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో పాప య్య మాట్లాడారు. నిబంధన లకు విరుద్ధంగా బాలలతో ప ని చేయించుకోవడంపై దృష్టి పెడ్తామన్నారు. ఎస్టీ వర్గాలకు చెందిన వ్యక్తులతో వెట్టిచాకిరీ చే యించుకుంటే తీవ్ర చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా బాధ్యతలు పొందిన ఆయన్ను పలువురు అభిమా నులు, వేవ్స్ సంస్థ సభ్యులు అభినందించారు.

ప్రతిభా విద్యార్థులకు పురస్కారాలు



విద్యార్థులతో అధికారులు, జేవీవీ నాయకులు

పొదలకూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక సభ్యులు ఆదివారం మండలంలో ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని పదో తరగతి పరీక్షల్లో 500పైన మార్కులు సాధించిన విద్యార్థులకు మెమోంటోలు, మెడల్స్ అందజేశారు. సాయిబాబా మందిరంలో జరిగిన అభినందన సభలో ముఖ్య అతిథులుగా జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుధీర్‌బాబు, నెల్లూరు అర్బన్ ఎంఈవో-2 అబ్దుల్ హమీద్, జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, పొదలకూరు ప్రభుత్వ వైద్యశాల వైద్యులు శిరీష పాల్గొన్నారు. కార్యక్రమంలో మండలం జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి కోవూరు వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ బీవీపీ కల్యాణ్, గౌరవాధ్యక్షులు దామోదరం, పెంచలస్వామి, దాతలు మురళీరెడ్డి, వెంకటసంతోష్‌కుమార్, తల్లిదండ్రులు ఉన్నారు.

శాంతి భద్రతలకు ప్రజలు సహకరించాలి

సీఐ రవినాయక్, కృష్ణపట్నం సర్కిల్



ముత్తుకూరు, మే 4 (ఆంధ్రజ్యోతి):శాంతి భద్రతలు, నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలని కృష్ణపట్నం సీఐ రవినాయక్ కోరారు. ప్రజల భద్రత, రక్షణకు ఏర్పాటు చేసిన చట్టాలను గౌరవించడం అందరి బాధ్యతన్నారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవ్ చేయకూడదని,హెల్మెట్ తప్పనిసరి ధరించాలన్నారు. ఈ విషయాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.

ముఖాముఖి

? వేసవి నివారణకు ఏ చర్యలు తీసుకున్నారు.

! వేసవి సెలవుల్లో ఊరికి వెళ్లే వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామాల్లో అవగాహన సభలు నిర్వహిస్తున్నాం. ఇంటి తలుపులు, తాళాలు వేసి వెళ్లే వారు పోలీస్‌స్టేషన్‌లో సమాచారమిస్తే గస్తీ ఏర్పాటు చేస్తాం.

? ట్రాఫిక్ నియంత్రణ చర్యలేవి.

! ముత్తుకూరులో రద్దీగా ఉండే ప్రాంతాలు, ప్రధాన కూడళ్లలో పోలీసులను నియమించి నియంత్రణ చేపడుతున్నాం. ఉదయం, సాయంత్రం వాహ నాల రద్దీ ఉండే సమయంలో భారీ వాహ నాలు రాకపోకలు లేకుండా చూస్తున్నాం.

? పారిశ్రామిక ప్రాంతాల్లో భద్రతా చర్యల పరిస్థితి ఏమిటి.

! పారిశ్రామిక ప్రాంతాల్లో అపరిచితుల సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలి. అద్దెకు ఇళ్లు ఇచ్చేవారు తప్పనిసరిగా వారి వద్ద నుంచి సరైన ధ్రువపత్రాలు తీసుకుని, విచారించాకే ఇల్లు అద్దెకు ఇవ్వాలి.

న్యూస్ బాక్స్

దత్తాత్రేయుడిగా మూలస్థానేశ్వరుడు

నెల్లూరు (సాంస్కృతికం), మే 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలస్థానేశ్వరాలయంలో వసంతోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం మూలస్థానేశ్వర స్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష పూజలు, పూలంగి సేవ జరిగాయి. రాత్రి స్వామికి దత్తాత్రేయ స్వామి అలంకరణ, పూజలు జరిగాయి. ఆలయ ఈవో అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, సిబ్బంది, ఉభయకర్తలు పర్యవేక్షించారు.

బీదను కలిసిన డీసీఎంఎస్ చైర్మన్ గొంగటి

నెల్లూరు (హరనాథపురం), మే 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్‌గా నియమితులైన గంగోటి నాగేశ్వరరావు ఆదివారం శాసన మండలి సభ్యుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రను నగరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గంగోటికి, బీద శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బీదను నాగేశ్వరరావు సత్కరించారు.

బెదిరించి షాపులోని సామాన్లు బయట పడేశారు !

నెల్లూరు(క్రైం), మే 4 (ఆంధ్రజ్యోతి) : షాపు ఖాళీ చేయకపోతే రౌడీలను పెట్టి కొట్టిస్తానని బెదిరించి మరీ తమ షాపులోని సామాన్లు గుర్తుతెలియని వ్యక్తులతో బయట పడేశారని చిన్నబజారు పోలీసులకు శెట్టిగుంట రోడ్డు ప్రాంతానికి చెందిన గట్టం విజయ్ ఆదివారం ఫిర్యాదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. శెట్టిగుంట రోడ్డు బట్టీలవారి వీధిలో విజయ్ నివాసం ఉంటున్నారు. ఆయన 2006 నుంచి జిల్లా కోర్టును ఆనుకొని ఉన్న ప్రభుత్వ డ్రైవర్స్ అసోసియేషన్‌కి చెందిన రాజు కాంప్లెక్స్‌లో టీ దుకాణం అద్దెకు నిర్వహిస్తున్నారు. ఆ టీ షాపును వేరొకరికి ఇచ్చేందుకు స్థానికుడైన చిరంజీవి ఇటీవల ప్రయత్నించాడు. ఈ క్రమంలో షాపు ఖాళీ చేయకపోతే రౌడీలను పెట్టి కొట్టిస్తానని విజయ్‌ను బెదిరించాడు. శనివారం సాయంత్రం విజయ్ దుకాణానికి తాళాలు వేసుకొని ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం వచ్చేసరికి షాపులోని సామాన్లు చిందరవందరగా పడి ఉన్నాయి. అక్కడే కొందరు వ్యక్తులు షాపు ముందు కుర్చీలు వేసుకొని కూర్చొని ఉన్నారు. దీంతో విజయ్ చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈదురుగాలులతో వర్షం

ముత్తుకూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఆదివారం సాయంత్రం మేఘాలు కమ్ముకుని ఈదురు గాలులతో వీచాయి. ఈ గాలుల తాకిడికి పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. ఎంపీడీవో కార్యాలయం వద్ద నీడనిచ్చే వృక్షం గాలి తాకిడికి విరిగి పడింది. కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో సరఫరాలో అంతరాయం నెలకొంది. గాలుల దుమారంతో రోడ్లపై వాహనచోదకులు వెళ్లేందుకు ఇబ్బందిపడ్డారు. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కొద్దిసేపు బీభత్సాన్ని సృష్టించింది.

రాపూరులో..

రాపూరు (ఆంధ్రజ్యోతి):పట్టణంలో సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. సుమారు గంట పాటు కురిసిన వర్షానికి పాత బస్టాండ్ బజారు వీధి రోడ్డు జలమయమైంది. వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు. వర్షం వలన పెంచలకోన క్షేత్రంలో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది.

రాపూరులో ఉచిత వైద్య శిబిరం

రాపూరు, మే 4 (ఆంధ్రజ్యోతి):స్థానిక సివికే ప్రభుత్వ కళాశాలలో ఆదివారం డాక్టర్ కడివేటి లోకేష్ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీ స్కంద ఆయుర్వేదిక్ మల్టీ స్పెషాలిటీ సహకారంతో నిర్వహించిన శిబిరంలో రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పెంచలకోన ఆలయ ఫెస్టివల్ చైర్మన్ చెన్ను తిరుపాల్‌రెడ్డి వైద్య శిబిరం నిర్వాహకులను అభినందించారు.

7న వెంకటాచలం మండల సమావేశం

వెంకటాచలం, మే 4 (ఆంధ్రజ్యోతి):స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 7వ తేదీ ఉదయం 11 గంటలకు సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కల్పన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం, విద్య, పంచాయతీరాజ్, రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానవన, ఉపాధిహామీ పథకం, వైద్యఆరోగ్య, వెలుగు పథకం, మత్స్య, స్త్రీ శిశు సంక్షేమ, గృహనిర్మాణ, విద్యుత్, ఇరిగేషన్, అటవీ, పశుసంవర్ధక, రోడ్లు భవనాల శాఖలపై సమీక్షతో పాటు అధ్యక్షుల వారి అనుమతి తో ఇతర అంశాలపై సమీక్ష జరుగుతుందన్నారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, అన్నిశాఖల అధికారులు తప్పక సమావేశానికి హాజరుకావాలని కోరారు.

కొనసాగుతున్న ఎన్‌సీసీ శిబిరం



వ్యాయామం చేస్తున్న విద్యార్థులు

వెంకటాచలం, మే 4 (ఆంధ్రజ్యోతి):చవటపాళెం పంచాయతీ సరస్వతీనగర్‌లోని అక్షర విద్యాలయంలో ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గొడంగవే ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్‌సీసీ శిబిరం ఆదివారం కొనసాగింది. జాతీయ సమైక్యత, సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే షిప్ మోడలింగ్, ఆయుధ, సోషల్ అవేర్నెస్, పేరెడ్ ట్రైనింగ్, యోగసనాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు నరేంద్రబాబు, మల్లికార్జున్‌రెడ్డి, మస్తానయ్య, కొండారెడ్డి, విద్యాసాగర్, అరోరా, సాయిశంకరి, దివ్య, రంజన్ దీపక్ ఉన్నారు.

కర్మక్రతువుల మండప నిర్మాణం కూల్చివేత

బుచ్చిరెడ్డిపాళెం,మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మినగల్లులో కర్మక్రతువుల కోసం స్థానిక సర్పంచు బొర్రు పూజిత రూ.4లక్షల సొంత నిధులతో నిర్మించిన మండపాన్ని ఓ టీడీపీ నాయకుడి సహకారంతో ఇద్దరు వైసీపీ నాయకులు శనివారం రాత్రి నేలమట్టం చేశారు. ఈ విషయంపై దాతలు 100కు డయల్ చేసి సమాచారం ఇచ్చినా పోలీసులు కనీసం అటువైపు కన్నెత్తికూడా చూడలేదని బాధిత సర్పంచు భర్త రాము ఆవేదన వ్యక్తం చేశారు.

చిన్నారులకు ఉచిత ఖత్నా

బుచ్చిరెడ్డిపాళెం, మే 4 (ఆంధ్రజ్యోతి):దామరమడుగులోని పుచ్చలపల్లి సుందరయ్య కల్యాణ మండపంలో జమీయతిత్ ఉలామా యే హింద్ ఆధ్వర్యంలో ఆదివారం నిరుపేద కుటుంబాలకు చెందిన 50మంది చిన్నారులకు ఉచితంగా ఒడుగులు (ఖత్నా) చేయించారు. అలాగే ఒడుగులు చేయించుకున్న పిల్లలకు రూ.500విలువ చేసే విటమిన్‌తో కూడిన ఆహార పదార్థాలు, మందులను ఉచితంగా అందజేశారు. ముఖ్య అతిథులుగా జమీయర్ రాష్ట్ర వైస్ ప్రెసి డెంట్ హజరత్ మౌలానా ఇలియాజ్ సాహెబ్, బుచ్చి ప్రభుత్వ ఖాజీ మౌలానా ముఫ్తీ అబ్దుల్ హయుమ్ ఖాస్మీ పాల్గొన్నారు. ఒడుగులు చేయించుకున్న చిన్నారులకు అల్పాహారం, భోజన వసతులు కల్పించారు. కార్యక్రమంలో జమీర్, అబుబాకర్, రజాక్, రఫీ పాల్గొన్నారు.

ఆల్తుర్తిలో అగ్నిప్రమాదం

● ఏబీ స్విచ్ షార్టేజీతో చెలరేగిన మంటలు

పొదలకూరు, మే 4 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఆల్తుర్తి సమీపంలోని నాగూరు వాగు వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న ఏబీ స్విచ్‌లో సాంకేతిక లోపంతో ఏర్పడింది. ఈ సమస్యతో అగ్ని ప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న పొదలకూరు అగ్నిమా పక సిబ్బంది సంఘటన స్థలానికి వచ్చి వ్యాపించిన మంటలను అదుపు చేశారు.

కామాక్షితాయి సన్నిధిలో సేవా కమిటీ సభ్యులు

బుచ్చిరెడ్డిపాళెం, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ ఆలయంలో ఏర్పాటు చేసిన నూతన సేవా కమిటీ సభ్యులు ఆదివారం మల్లికార్జునస్వామి, కామాక్షితాయిని దర్శించుకున్నారు. ముందుగా ఆలయ కార్యనిర్వహణాధికారి ఏవీ శ్రీనివాసులురెడ్డి వారిని స్వాగతించి గోత్ర నామములతో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. సేవా కమిటీతో స్వామి,అమ్మవారి సేవలు చేసుకునే భాగ్యం కల్పించినందుకు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి కమిటీ సభ్యులు తిరువూరు అశోక్‌రెడ్డి, కనపర్తి నాగేంద్ర, నక్కల శివకృష్ణ, తిరువాయిపాటి నందకుమార్‌లు కృతజ్ఞతలు తెలిపారు.



తిరుపతి అన్నారావు సర్కిల్..



గంగమ్మ గుడి దారిలో విరిగిపడిన చెట్టు



పెద్దకాపు లేఅవుట్‌లో పడిపోయిన చెట్టు, ధ్వంసమైన కారు







దెబ్బతిన్న వాహనం, ఆటో, బైకులు

గాలివాన బీభత్సం

- కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- పిడుగుపాటుకు ముగ్గురి మృతి
- కాస్త చల్లబడిన జిల్లా

తిరుపతి, మే 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు చోట్ల ఆదివారం గాలివాన బీభత్సం సృష్టించింది. తిరుపతిలో దాదాపు రెండు గంటల పాటు వణికించింది. ఈదురు గాలులకు పలు చెట్లు నేలకొరిగాయి. హోర్డింగులు, ఫ్లెక్సీలు కూలాయి. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈదురుగాలులతో పాటు ఓ మోస్తరు వర్షం కురవడంతో రోడ్లపై వర్షపు నీరు పొంగి పొర్లాయి. దాదాపు రెండు గంటలపాటు వాహనదారులు రోడ్లపైకి వచ్చేందుకు భయపడ్డారు. నాయుడుపేట, గూడూరులో ఉరుములతో కూడిన వర్షం పడింది. ఈక్రమంలో పడిన పిడుగులకు నాయుడుపేట, ఓజిలి, చిల్లకూరు మండలాల్లో ముగ్గురు మృతిచెందారు. రేణిగుంట రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండు సమీపంలో వర్షపు నీరుతో పాటు మురుగునీరు రోడ్డుపైకి రావడంతో యాత్రికులు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు. పలు గ్రామాల్లో ఈదురు గాలులకు మామిడి కాయలు నేలరాలడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.





మధురానగర్‌లో చేరిన వర్షపు నీరు

సదరన్ డిస్కంకు రూ.20 లక్షల నష్టం

తిరుపతి(ఆటోనగర్), మే 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో గాలి వాన బీభత్సానికి సుమారు రూ.20 లక్షల నష్టం జరిగిందని సదరన్ డిస్కం టౌన్ డివిజన్ ఈఈ వి.చంద్ర శేఖర్ రావు తెలిపారు. పెనుగాలులకు చెట్లు, కొమ్మలు, ఫ్లెక్సీలు విరిగి విద్యుత్ తీగలపై పడ్డాయి. దీంతో 18 ట్రాన్స్‌ఫార్మర్లు, 70 విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. పది కిలోమీటర్ల వైర్లు తెగిపడ్డాయన్నారు. దశలవారీగా విద్యుత్ సరఫరాలో అంతరాయాన్ని పునరుద్ధరించినట్లు తెలిపారు. నగర పరిధిలో ఎక్కువగా ఫ్లెక్సీల వల్ల ఎక్కువ నష్టం జరిగినట్లు ఆయన చెప్పారు.

వర్షం కారణంగా తిరుపతి నగరంలో పలుచోట్ల చెట్లకొమ్మలు విరిగిపడి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. కార్పొరేషన్, ఎస్పీడీసీఎల్ అధికారులు రంగప్రవేశం చేసి సాయంత్రానికి సమస్యలను పరిష్కరించారు.

జాతర వాన అంటూ..

ప్రతిసారి తిరుపతి గంగజాతర చాటుకు ముందు చిన్నపాటి గాలులతో కూడిన వర్షం పడుతుందని స్థానికులు చెబుతుంటారు. ఈ క్రమంలో గంగజాతరకు మంగళవారం జరగనున్న చాటింపునకు ముందు వర్షం పడడంపై జాతరవానగా భక్తులు విశ్వసిస్తున్నారు. జాతర మొదలవ్వబోతుందన్న సంకేతాన్ని గాలివాన ద్వారా వచ్చిందని, వర్షంతో నగరం చల్లబడిందని సోషల్ మీడియాలో అమ్మవారి భక్తులు పోస్టులు పెడుతున్నారు.

బడుగులపై 'పిడుగు'

- వద్దిగుంట కండ్రిగలో వ్యవసాయ కూలీ మృతి

నాయుడుపేట టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం వద్దిగుంట కండ్రిగ గ్రామంలో వరినాట్లు వేయడానికి వ్యవసాయ కూలీ అనాల భాస్కర్(50) వెళ్లారు. ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో భారీ వర్షం రావడంతో సమీపంలోని చెట్టుకిందకు చేరారు. అదే సమయంలో పిడుగుపడడంతో అక్కడికక్కడే కుప్పకూలారు. స్థానికులు ఆయన్ను నాయుడుపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.



బాతుల కాపరి మృతి

చిల్లకూరు, ఆంధ్రజ్యోతి: చిల్లకూరు మండలం కాకువారిపాళెం సమీపంలోని పొలాల్లో ఆదివారం పిడుగుపడి బాతుల కాపరి మునీంద్ర (30) మృతిచెందారు. వాకాడు మండలం బాలిరెడ్డిపాళేనికి చెందిన ఈయన కాకువారిపాళెం సమీపంలోని పొలాల్లో బాతులు మేపుతుండగా ఈ ప్రమాదం జరిగింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

తాటికాయలు తీసుకొస్తుండగా..



ఓజిలి, ఆంధ్రజ్యోతి: ఓజిలి మండలం గ్రద్దగుంట పంచాయతీ గొల్లపాళేనికి చెందిన మారుబోయిన కార్తీక్ (12) తాటికాయలు తీసుస్తుండగా పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. నాయుడుపేటలో ఏడో తరగతి చదువుతున్న ఇతడు, వేసవి సెలవుల్లో ఇంటికొచ్చాడు. మరో బాలుడితో కలిసి ఆదివారం సమీప పొలాల్లో తాటికాయల కోసం వెళ్లాడు. కార్తీక్ బాబాయి వారికి తాటికాయలు కొట్టించి.. వర్షం వస్తుండటంతో ఇంటికి పంపేశారు. ఇంటికి సమీపానికి వచ్చేసరికి జల్లులతో పాటు పిడుగు పడటంతో కార్తీక్ అక్కడికక్కడే మృతి చెందాడు. పక్కనే ఉన్న మరో బాలుడు స్పృహ తప్పి పడిపోయాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు నాయుడుపేటకు తరలించారు.

తిరుపతిలో విరిగిన వందేళ్ల వృక్షం

తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయ సమీపంలో వందేళ్ల నాటి వృక్షం ఈదురుగాలులకు సగ భాగం విరిగి రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. ఆ సమయంలో అక్కడే ఉన్న ఓ ఆటో డ్రైవర్‌కు చిన్నపాటి గాయాలయ్యాయి. కర్నాల వీధిలో మరో చెట్టు నేలకొరిగింది, సాయినగర్‌లో చెట్టుకొమ్మ విరిగి పడడంతో ఆటో ధ్వంసమైంది. వేర్వేరు చోట్ల చెట్లు పడి ఓ కారు, జీపు, రెండు బైకులు దెబ్బతిన్నాయి.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

గాలులకు పలు కరెంటు స్తంభాలు నేలకొరిగాయి. పలుచోట్ల చెట్లు, ఫ్లెక్సీలు విరిగి కరెంటు తీగలపై పడ్డాయి. ఈ ఘటనలతో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్తు శాఖ అధికారులు స్పందించి త్వరితగతిన సరఫరాను పునరుద్ధరించారు. ఇక, తిరుపతి రూరల్ మండలం చిగురువాడ పంచాయతీలో ఈదురుగాలుల కారణంగా ట్రాన్స్‌ఫార్మర్‌పై చెట్టు కూలింది. ఇక్కడ మరమ్మతులు చేయడానికి వెళ్లిన సచివాలయ జేఎల్ఎం మురళి గాయపడగా, ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. కేవీబీపురంలో విద్యుత్ సబ్ స్టేషన్‌పై చెట్టు కూలడంతో సరఫరా ఆగింది. ఇలా..



పిచ్చాటూరు మండలం కొత్తగొల్లకండ్రిగ వద్ద..



తిరుపతి పద్మావతి డిగ్రీ కళాశాల కేంద్రం వద్ద..



తమ పిల్లలు పరీక్ష రాస్తుండగా.. వర్షంలో తడుస్తున్న తల్లిదండ్రులు

ప్రశాంతంగా నీట్

- 4,333 మంది విద్యార్థులు హాజరు.. 112 మంది గైర్హాజరు
- విద్యార్థులకు తప్పని కరెంటు కష్టాలు

తిరుతి(విద్య), మే 4(ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల ప్రవేశాలకు నిర్వహించే జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్ యూజీ-2025) ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరగ్గా.. ఉదయం 11 గంటల నుంచే విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. జిల్లా వ్యాప్తంగా 4,445 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 4,333 మంది పరీక్ష రాయగా, 112 మంది గైర్హాజరయ్యారు. తిరుపతిలోని పలు పరీక్ష కేంద్రాలను డీఆర్వో నరసింహులు తనిఖీ చేశారు. తిరుపతిలో 9, గూడూరులో ఒకటి చొప్పున 10 కేంద్రాల్లో ఆఫ్‌లైన్ విధానంలో పరీక్ష జరిగింది. అన్ని పరీక్షా కేంద్రాలవద్ద 144 సెక్షన్ అమలు చేశారు. పరిసర ప్రాంతాల్లో జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లను మూయించారు. కేంద్రియ విద్యాలయం-1 ప్రిన్సిపల్ హేమంత్‌కుమార్ పాండ్య నీట్ సిటీ కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు.





ముక్కుపుడక తీసిస్తూ.. - విద్యార్థి చేతి దారాన్ని తీసేస్తున్న సిబ్బంది

విద్యార్థులతో కలిసొచ్చిన తల్లిదండ్రులు

విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులూ పెద్ద సంఖ్యలో పరీక్ష కేంద్రాల వద్దకు వచ్చారు. పరీక్ష బాగా రాయాలని ధైర్యం చెప్పారు. కొందరు పిల్లలు తల్లిదండ్రులతో సెల్ఫీలు తీసుకుంటూ నీట్‌కు హాజరవుతున్న సందర్భాన్ని పదిలం చేసుకున్నారు.




విద్యార్థులకు బయోమెట్రిక్ వేస్తున్న సిబ్బంది

చీకట్లో పరీక్షలు : ఆదివారం మధ్యాహ్నం తిరుపతిలో సుమారు రెండు గంటలపాటు భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులు బలంగా వీయడంతో నగరంలో పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.దీంతో తిరుపతిలోని పరీక్షా కేంద్రాల్లోనూ విద్యుత్తు సరఫరా ఆగింది.భారీ గాలులు, వర్షంతో కిటికీలు, తలుపులు వేశారు. అదే సమయంలో కరెంటు పోవడంతో గదుల్లో నెలకొన్న చీకటిలోనే విద్యార్థులు పరీక్ష రాయాల్సి రావడంతో అసౌకర్యానికి గురయ్యారు.

గ్రూప్-1 పరీక్షలకు 619మంది హాజరు

తిరుపతి(కలెక్టరేట్), మే 4(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్ రాతపరీక్షకు ఆదివారం 911 మంది అభ్యర్థులకు గాను 619 మంది హాజరయ్యారని డీఆర్వో నరసింహులు తెలిపారు.కేంద్రాలను తనిఖీ చేసిన ఆయన పరీక్షల నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు.డీఆర్వో మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరుగుతున్నాయన్నారు. అభ్యర్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించామని తెలిపారు.

తిరుమల ఘాట్‌రోడ్లకు మహర్దశ



- రూ.10.75 కోట్లతో పనులకు టీటీడీ ప్రణాళిక

తిరుమల, మే4(ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్ రోడ్ల మరమ్మతులపై టీటీడీ దృష్టి సారించింది. రూ.10.75 కోట్లతో అభివృద్ధి చేయాలని సంకల్పించింది. తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండవ ఘాట్‌రోడ్డు 17 కిలోమీటర్లు, తిరుమల నుంచి తిరుపతి చేరుకునే మొదటిఘాట్‌రోడ్డు 18 కిలోమీటర్ల పొడవుతో ఉంటాయి. భక్తు రద్దీ నేపథ్యంలో రోజూ 10 వేల వాహనాలు ఈ మార్గాల్లో రాకపోకలు సాగిస్తున్నాయి. లారీలు, టిప్పర్లు కూడా తిరుగుతుంటాయి. దీంతో తరచూ ఘాట్ రోడ్లు దెబ్బతింటున్నాయి. చివరిగా 2021 జనవరిలో కొత్త రోడ్లు(బీటీ రెన్యూవల్ కోట్) వేశారు. అయితే కొవిడ్ తర్వాత వాహనాల సంఖ్య పెరిగింది. 2021 నవంబరు, డిసెంబరు నెలల్లో భారీ వర్షాలు, డ్రైనేజి, క్రాష్‌బ్యారియర్ వంటి పనులతో ఘాట్‌రోడ్లు భారీగా దెబ్బతిన్నాయి. అనేక ప్రాంతాల్లో గుంతలు ఏర్పాడ్డాయి.

వర్షాకాలం రాకముందే పూర్తి

భక్తులు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని టీటీడీ అధికారులు ఘాట్‌రోడ్లలో మళ్లీ మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించారు. బిట్యూమినస్ కాంక్రీట్, బిట్యూమినస్ మెకాడమ్, హాట్ అప్లైడ్ థర్మోప్లాస్టిక్ కంపౌండ్ వంటి పనులతో పాటు రైజ్డ్ పేవ్‌మెంట్ మార్కర్లు(రోడ్ స్టడ్స్), సైన్‌బోర్డులు వంటిని ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందించింది. వర్క్స్ కమిటీ కూడా మరింత అధ్యయనం చేపట్టి చర్యలు తీసుకోవాలని సూచించింది. వర్షాకాలం రాకముందే ఈపనులు ప్రారంభించేలా టెండర్లను ఆహ్వానించేందుకు టీటీడీ సిద్ధమవుతోంది.

7న సత్యవేడుకు మంత్రి లోకేశ్?

సత్యవేడు, మే 4 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ ఈనెల 7న సత్యవేడుకు రానున్నట్లు సమాచారం. సత్యవేడులో జరగనున్న టీడీపీ సమన్వయ సమావేశానికి హాజరవుతారని తెలిసింది. ఇటీవల పార్టీ చేపట్టిన సభ్యత్వ నమోదులో ముందు వరుసలో నిలిచిన పార్టీ నేతలు, కార్యకర్తలతో లోకేశ్ భేటీ కానున్నారని సమాచారం. ఈ మేరకు లోకేశ్ పర్యటన విజయవంతం చేసేందుకు కూటమి నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యకర్తలతో లోకేశ్ సమావేశమయ్యేందుకు స్థానిక వారపు సంత వద్ద స్టేజీ ఏర్పాటు చేస్తున్నారు. లోకేశ్ పర్యటన నేపథ్యంలో శాప్ ఛైర్మన్ రవినాయుడు ఆదివారం సత్యవేడుకు చేరుకుని స్థానిక నేతలతో చర్చించారు. లోకేశ్ కార్యకర్తల సమావేశం అనంతరం రాత్రి సత్యవేడులోనే బస చేసి, 8వ తేదీ ఉదయం శ్రీసిటీలో జరగనున్న ఎల్‌జీ పరిశ్రమ భూమిపూజలో పాల్గొంటారని సమాచారం. లోకేశ్ పర్యటనపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

రోడ్డు బ్లాక్ చేసి భవన నిర్మాణ పనులు

వాహనదారుల ఇబ్బందులు



రాఘవయ్యపేట రోడ్డు మధ్యలో ఉన్న ఇసుక, కంకర, యంత్రాలు

సూళ్లూరుపేట, మే 4(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి రాఘవయ్యపేటకు వెళ్లే రోడ్డులో ఓ భవన భవన నిర్మాణం కోసం ఇసుక, కంకర పోసి బ్లాక్ చేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి కోళ్లమిట్ట, పాలవల్లీవారివీధి, డీఆర్‌డీఎల్ షార్ కాలనీకి వెళ్లే ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. ఓ భవన నిర్మాణం చేపట్టిన వ్యక్తి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా శనివారం రాత్రి నుంచి రోడ్డును బ్లాక్ చేసి పనులు చేసుకొంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు. శనివారం అర్థరాత్రి పాలవల్లీవారివీధిలో ఓ వ్యక్తికి ఆరోగ్యం బాగలేదని ప్రభుత్వాస్పత్రి వద్దనున్న ప్రైవేట్ అంబులెన్స్‌ను రప్పించారు. రాఘవయ్యపేట ప్రధాన రోడ్డులో కంకర, ఇసుక పోసి బ్లాక్ చేసి ఉండడంతో అంబులెన్స్ వెళ్లలేని పరిస్థితి. చేసేదేమి లేక అంబులెన్స్ వెనక్కి వెళ్లి షార్ వై జంక్షన్ మార్గం గుండా పోవాల్సి వచ్చింది. రైల్వేగేటు తూర్పు వైపు నుంచి బజారు సెంటర్‌కు రావాలన్నా, బజారు సెంటర్ నుంచి అటువైపు వెళ్లాలన్న రాఘవయ్యపేట రోడ్డు ప్రధాన మార్గం కావడంతో నిత్యం రాకపోకలు సాగుతుంటాయి. అలాంటి రోడ్డును వ్యక్తిగత భవన నిర్మాణం కోసం ముందురోజు రాత్రి నుంచి బ్లాక్ చేయడం ఏమిటని స్థానికులు ప్రశ్నించారు. మున్సిపాలిటీ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ చిన్నయ్యను వివరణ కోరగా తమ దృష్టికి రాలేదని, బ్లాక్ చేసిన రోడ్డులో ఇసుక, కంకర తొలగింపచేస్తామన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహప్రతిష్ఠ



ఆంజనేయస్వామి విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

గూడూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరమ్మకాలనీలోని సునీల్ కుమార్ నగర్‌లో నూతనంగా నిర్మించిన కార్యసిద్ధి ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారి నూతన విగ్రహ ప్రతిష్ఠ, కుంబాభిషేక పూజలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచన, క్షీరాధివాసం, జలాధివాసం పూజలు జరిపారు. వేదపండితుల మంత్రోచరణల నడుమ శాస్త్రోపేతంగా హోమాలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో శివకుమార్, హరి, గోపాల్‌రెడ్డి, విజయ్‌భాస్కర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, పెంచలయ్య, సురేంద్ర, దేవాసిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నీట్



పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

గూడూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో నిర్వహించిన నీట్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. మధ్యాహ్నం 2నుంచి 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచే విద్యార్థులను విద్యార్థులను క్షుణంగా తనిఖీ చేసి పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. 409 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 398 మంది హాజరయ్యారని కోఆర్డినేటర్, తహసీల్దారు చంద్రశేఖర్ తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు.

పిడుగుపాటుకు గేదె మృతి

గూడూరు, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు గ్రామంలో ఆదివారం పిడుగుపాటుకు గేదె మృతి చెందింది. చెన్నూరు ముస్లిం వీధికి చెందిన శ్రీనివాసులు సమీపంలోని పొలాల్లోకి గేదెలను మేతకు తోలుకెళ్లాడు. అదే సమయంలో పిడుగు పడడంతో గేదె మృతి చెందింది.

చిల్లకూరులో ఆవుదూడ..

చిల్లకూరు: మండలంలోని వడ్డికండ్రిగ గ్రామంలో పిడుగు పడడంతో ఆవుదూడ మృతి చెందాయి. గ్రామానికి చెందిన పాడిరైతు ఇంటి సమీపంలో ఆవు దూడను కట్టేసి ఉండగా పిడుగు పడడంతో మృతి చెందాయి.

చిట్టేడులో ఉచిత వైద్య శిబిరం



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

కోట, మే 4 (ఆంధ్రజ్యోతి): కోట మండలం చిట్టేడు ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. రాఘవపురం గ్రామానికి చెందిన ప్రముఖ బిల్డర్ మర్రిబోయిన రాజేంద్ర ఆధ్వర్యంలో గూడూరుకు చెందిన ఆర్‌కే మల్టీ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు త్రివిక్రమ్, కీర్తి రోగులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచు రాఘవయ్య, గోపాల్, సుబ్బారావు, కృష్ణపట్నం చంద్రశేఖర్, తలారి వెంకటేశ్వర్లు, వెంకటరమణయ్య, యాకసిరి చిన్నయ్య, వెంకటేశ్వర్లు, దాసరి శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయిబాబా ఆరాధన పూజలు

గూడూరు అర్బన్, మే 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక కుమ్మరవీధిలోని ప్రేమ సుధా సత్యసాయి మందిరంలో ఆదివారం సత్యసాయిబాబా సమితి ఆధ్వర్యంలో ఆరాధనోత్సవాలు నిర్వహించారు. భజనలు చేసి స్వామివారి కీర్తనలను ఆలపించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకుని ప్రశాంత జీవనం సాగించాలన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులకు యోగా, ధ్యానంపై ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నా మన్నారు. కార్యక్రమంలో ప్రతాప్ కుమార్, సురేష్, గౌతమి, సునంద, మల్లికార్జున, సుబ్బారావు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



సత్యసాయి ఆరాధన పూజల్లో భక్తులు

రైలు ఢీకొని వృద్ధుడి దుర్మరణం

దొరవారిసత్రం, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మావిళ్లపాడు గ్రామానికి చెందిన బట్టా చంద్రయ్య(60) రైలు ఢీకొని మృతి చెందాడు. ఆదివారం పొలాల్లోకి వెళ్లిన చంద్రయ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో దుర్మరణం పాలయ్యాడు. స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సూళ్లూరుపేట రైల్వే పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహానికి ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



చంద్రయ్య (ఫైల్‌ఫొటో)

రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలుడి మృతి

తడ, మే 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. తమిళనాడు ఆరంబాకం బాట కుప్పం ప్రాంతానికి చెందిన దేశప్పన్(14) తడ మండలం వాటంబేడు కుప్పంలో ధర్మరాజస్వామి ఉత్సవాల్లో పాల్గొనేందుకు గత నెల 29న బంధువుల ఇంటికి వెళ్లాడు. స్నేహితుడు శివలింగంతో కలిసి మోటరు సైకిల్‌పై సూళ్లూరుపేటకు వెళ్తుండగా బైక్ అదుపు తప్పి కిందపడడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులకు సూళ్లూరుపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యంకోసం ఇరువురినీ చెన్నైకి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ దేశప్పన్ శనివారం మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు తడ పోలీసులు కేసు నమోదు చేశారు.



కాళంగి బ్రిడ్జి రోడ్డులో పార్కింగ్ చేసి ఉన్న బస్సులు - పార్కింగ్ చేసిన బస్సుల మధ్య వంట చేస్తున్న భక్తులు

రూటు మార్చిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు

చెంగాళమ్మ ఆలయానికి ఎగువ రోడ్డులో పార్కింగ్ ● భక్తులకు తప్పని ఇబ్బందులు

సూళ్లూరుపేట, మే 4(ఆంధ్రజ్యోతి): ఇన్నాళ్లు చెంగాళమ్మ ఆలయం వద్ద రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేసే పరిశ్రమలకు వెళ్లే ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల యజమానులు రూటు మార్చారు. ఎవరెన్ని ఆంక్షలు పెట్టిన మేము రోడ్డు ఎక్కడ ఖాళీ కనిపిస్తే అక్కడ అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తామన్న చందంగా వ్యవహరిస్తున్నారు. పోలీసులు పట్టించుకోకపోవడంతో ఇష్టానుసారంగా పదుల సంఖ్యలో బస్సులను ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేసి వెళ్లిపోతున్నారు. చెంగాళమ్మ ఆలయం ఎగువన కాళంగి నది బ్రిడ్జిని ఆనుకొని జాతీయ రహదారి ప్రారంభంలో ఉన్న ఆలయ ముఖద్వారా ఆర్చి వరకు రోడ్డుకు ఇరువైపులా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను పార్కింగ్ చేస్తున్నారు. ఆదివారం, శుక్రవారం అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులు ఇక్కడ రోడ్డుకు ఇరువైపులా షామియానాలు వేసుకొని పొంగళ్లు పెట్టుకునేవారు. ప్రస్తుతం వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో భక్తులు పొంగళ్లు పెట్టుకోలేని పరిస్థితి నెలకొంది. ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. కొందరు అమ్మవారికి పొంగళ్లు పెట్టేందుకు వెళ్లగా అక్కడకు బస్సులు పార్కింగ్ చేసి ఉండడంతో వెనుదిరగాల్సి వచ్చింది. ఆలయం అనుకొని కాళంగి బ్రిడ్జి నుంచి జాతీయ రహదారి వద్దనున్న అమ్మణ్ణి ఆర్చి వరకు రోడ్డుకు ఇరువైపులా పెద్దపెద్ద వృక్షాలు ఉండడంతో భక్తులకు అన్ని విధాలా సౌకర్యంగా ఉండేది. భక్తులు పొంగళ్లు పెట్టుకునేందుకు అనువైన ప్రాంతం ప్రైవేట్ బస్సుల పార్కింగ్‌గా మారడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇవతలి వైపు నుంచి అవతలకు...

మొదట చెంగాళమ్మ ఆలయం వద్ద రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేసుకొనేవారు. భక్తులు, ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవడంతో పోలీసులు నో పార్కింగ్ బోర్డులు పెట్టి వాహనాలు నిలిపితే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. దీంతో ట్రావెల్స్ బస్సుల యజమానులు మకాం మార్చి ఆలయం అవతల వైపు కాళంగి బ్రిడ్జి ఆనుకొని రోడ్డుకు ఇరువైపులా బస్సులను పార్కింగ్ చేసుకుంటున్నారు. ఆదివారం ఆలయానికి వచ్చిన పలువురు భక్తులు ఇదేమి నిర్వాకమంటూ ఆలయంలో పనిచేసే సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. పోలీసులు స్పందించి బ్రిడ్జికి అవతలి వైపు కూడా ప్రైవేట్ బస్సులను పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



గూడూరు ఆర్టీసీ బస్టాండు రోడ్డు, ఐసీఎస్ రోడ్డులో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు

కుండపోత వర్షం

గూడూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): గూడూరు పట్టణం, పరిసర ప్రాంతాల్లో ఆదివారం కుండపోత వర్షం కురిసింది. ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చోటుచేసుకుని గాలులు, ఉరుములు, మెరుపులతో గంటకు పైగా వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం 3:30 గంటల నుంచి ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమైంది. 4:30 గంటల నుంచి గాలులు, మెరుపులు, ఉరుములతో గంటకు పైగా కుండపోత వర్షం కురిసింది. ఆర్టీసీ బస్టాండు రోడ్డు, ఐసీఎస్ రోడ్డు, చర్చివీధి, ఆస్పత్రి రోడ్డు, శాంతినగర్ అండర్ బ్రిడ్జి, మాళవ్యానగర్ ప్రాంతాల్లో వర్షపునీరు రోడ్లపై ప్రవహించడంతో పాదచారులు, వాహన దారులు ఇబ్బందులు పడ్డారు. దాదాపు రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

చిల్లకూరు: మండలంలో గంటపాటు ఉరుములు, మెరుపులతో కూడిన కుండపోత వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వచేరడంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

నాయుడుపేట: ఎండ తీవ్రత, ఉక్కపోతతో అల్లాడుతున్న జనానికి ఆదివారం కురిసిన వర్షంతో ఉపశమనం కలిగింది. మధ్యాహ్నం వరకు భానుడి ప్రతాపంతో ఎండ అధికంగా ఉన్నా ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చోటు చేసుకుని ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు కూడలి ప్రాంతాలు జలమయమయ్యాయి. విద్యుత్ అంతరాయం ఏర్పడడంతో ఆ శాఖ సిబ్బంది మరమ్మతులు చేపట్టి సరఫరా పునరుద్ధరించారు.

పెళ్లకూరు: మండలంలో ఉరుములు, మెరుపులతో తేలికపాటి జల్లులు పడ్డాయి. ఉదయం నుంచి ఎండ ఉన్నా సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘామృతమై చిరుజల్లులతో కూడిన వర్షం పడింది.

వెంకటగిరి టౌన్: పట్టణంలో ఉరుములతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ ఉన్నా మధ్యాహ్నం తరువాత మబ్బులు కమ్ముకున్నాయి. ఉరుములతో పాటు మోస్తరు వర్షం పడింది.

కోట: మండలంలో ఈదూరు గాలులతో కూడిన మోస్తారు వర్షం కురిసింది. గాలులు వీయడంతో పలుచోట్ల చెట్లు కూలిపోగా, అరటి తోటలు దెబ్బతిన్నాయి. విద్యానగర్, చంద్రశేఖరపురం, ఉనుగుంటపాళెం, రాఘవపురం, చిట్టేడు గ్రామాల్లో మామిడి కాయలు రాలిపోయాయి. మండల పరిధిలోని శ్రీనివాససత్రం, గోవిందపల్లిపాళెం వద్ద సముద్రం కల్లోల భరితంగా మారింది.

బాలాయపల్లి: మండలంలో ఉరుములు మెరుపులు, ఈదురు గాలులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. కోటంబేడు గ్రామంలో అరటి చెట్లు నేలకొరిగాయి. పిగిలాం, నిండలి గ్రామాల్లో మామిడి కాయలు రాలిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చిల్లకూరులోని దళితవాడలో నిలిచివున్న వర్షపునీరు - నాయుడుపేట పాత వెంకటగిరి రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు

ఉదయం నిప్పుల కొలిమి... సాయంత్రం చిరు జల్లులు



ఎండ తీవ్రతతో మధ్యాహ్నం 1 గంటకు నిర్మానుషంగా ఉన్న బాపూజీ వీధి - సాయంత్రం 4 గంటలకు చిరు జల్లులు

సూళ్లూరుపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో పట్టణంలో ఆదివారం విభిన్న వాతావరణం చోటు చేసుకుంది. ఉదయం 7 గంటల నుంచి భానుడు భగభగలతో ఎండ నిప్పుల కొలిమిని తలిపించింది. తీవ్ర ఉక్కపోతతో జనం అల్లాడిపోయారు. పట్టణంలో ప్రధాన వీధులన్నీ నిర్మానుషంగా కనిపించాయి. మధ్యాహ్నం 2 గంటలకు కారుమబ్బులు కమ్ముకున్నాయి. ఆకాశం మేఘమృతమై ఉరుములు, మెరుపులతో చిరుజల్లులు పడ్డాయి. ఉదయం నుంచి ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజలకు కాస్త ఉపశమనం లభించింది.



ఘటం కుండకు పూజలు చేస్తున్న భక్తులు - బజారు వీధిలో దున్నపోతు ఊరేగింపు

ఘటంతో పోలేరమ్మ జాతర ప్రారంభం

నాయుడుపేట/టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలేరమ్మ జాతర ఉత్సవాలు ఆదివారం ఉదయం ఘటంతో ప్రారంభమయ్యాయి. ఆలయం వద్ద కమిటీ అధ్యక్షుడు నానబాల సుబ్బారావు, పెదకాపు అరవభూమి శ్రీనివాసులురెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి ఘటంతో జాతరను ప్రారంభించారు. మంగళ వాయిద్యాల నడుమ ఘటం కుండలు, దున్నపోతుతో పట్టణంలో సంచరిస్తూ మడి బియ్యం సేకరించారు. మహిళలు ఘటానికి, దున్నపోతుకు ప్రత్యేక పూజలు చేసి మడిబియ్యం సమర్పించారు. ఆదివారం, సోమవారం ఘటోత్సవం నిర్వహిస్తారు. మంగళవారం రాత్రి అమ్మవారి నిలుపు, బుధవారం జాతర నిర్వహించనున్నట్లు ఈవో రవికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, కమిటీ సభ్యులు మణి, ధనుంజయ, సాయి, శ్యామ్, రామారావు, స్థానికులు చిరంజీవి ఆచారి, అంజయ్య, బాబు, జనార్దన యాదవ్, విన్నమాల గ్రామస్తులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

చిల్లకూరు, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బల్లవోలు గ్రామంలో ఆదివారం పూరిల్లు దగ్ధమైంది. స్థానికుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన నాగభూషణం ఇంట్లో షార్ట్‌సర్క్యూట్ ఏర్పడి మంటలు రావడంతో పూరిల్లు కాలిపోయింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఇంట్లోని బంగారు నగలు, నగదు, గృహోపకరణాలు కాలిపోవడంతో సుమారు రూ.4లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు.

నేత్రదానం

సూళ్లూరుపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): ఆచార్య భరద్వాజ సేవాసంస్థ నిర్వహిస్తున్న నేత్రదానం 463కి చేరింది. పట్టణంలోని గాండ్లవీధికి చెందిన నాపా మునస్వామి(57) ఆదివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆయన నేత్రాలను భరద్వాజ సేవాసంస్థ ఆధ్వర్యంలో చెన్నై శంకర నేత్రాలయకు దానం చేశారు.



మునస్వామి (ఫైల్‌ఫొటో)

పాత్రదారుల అరెస్టు సరే...

సూత్రధారుల సంగతేమిటి?

టీడీపీ నేత హత్య వెనుక కుట్రకోణం వెలుగులోకి వచ్చేనా!

నాయుడుపేట టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం అత్తివరం గ్రామానికి చెందిన టీడీపీ నేత ఎల్లు గురుమూర్తి హత్య కేసులో నలుగురిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అయితే వీరితో మృతుడు గురిమూర్తికి నేరుగా ఎలాంటి వివాదాలు లేవు. అత్తివరం గ్రామంలో ఇరువర్గాల మధ్య వివాదాలు ఉన్న నేపథ్యంలో ఒకరిపై ఒకరు దాడిచేసుకుని కేసులు నమోదు చేసుకున్నారు. ఈ క్రమంలో ఏప్రిల్ 27వ తేదీ రాత్రి గురుమూర్తి, అత్తివరం గ్రామానికే చెందిన అనిల్‌రెడ్డితో కలిసి మోటరు సైకిల్‌పై నాయుడుపేట నుంచి ఇంటికి వెళుతుండగా ద్వారకాపురం సమీపంలో మినీవ్యానుతో వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో గురుమూర్తి మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన మినీ వ్యాను, అందులోని ముగ్గురితో పాటు గురుమూర్తిని బైక్‌లో వెంబడించిన మరో వ్యక్తిని పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. అయితే మృతుడి కుమారుడు గురుతేజ తన తండ్రిని పథకం ప్రకారం హత్య చేయించారని, అందులో తమ సామాజిక వర్గానికి చెందిన వారే ప్రధాన పాత్ర పోషించారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు అత్తివరం గ్రామానికి చెందిన 13మందిపై కేసు నమోదు చేశారు. అయితే వ్యానుతో వెనుక నుంచి ఢీకొట్టి హత్య చేసిన ఘటనలో పాలుపంచుకున్న నలుగురిని మాత్రమే శనివారం పోలీసులు అరెస్టు చేశారు. మిగిలిన సూత్రధారులను విచారణ పేరుతో స్టేషన్‌కు పిలిపించి పంపించేశారు. తమ సామాజిక వర్గానికి చెందిన వారే తన తండిని హత్య చేయించారని మృతుడి కుమారుడు గురుతేజ ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఆ మరుసటి రోజే 13మందిపై కేసు కూడా నమోదు చేశారు. అలాగే హత్యకు ఉపయోగించిన వాహనాన్ని రెండు రోజుల ముందు గురుమూర్తి ప్రత్యర్థులు కొనుగోలు చేసినట్లు అగ్రిమెంట్ పేపర్లను పోలీసులు స్వాధీనం చేసుకోవడం కూడా సూత్రదారుల ప్రమేయం ఉందనడానికి బలం చేకూరుస్తోంది. అయితే కేవలం నలుగురు నిందితులనే అరెస్టు చేయడం వెనుక ఆంతర్యం ఏమిటనేది చర్చనీయాంశం అయింది.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం



అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

తడ, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాటంబేడుకుప్పంలో ఉన్న పంచపాండవ ద్రౌపది సమేత ధర్మరాజస్వామి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు ఆదివారం అగ్నిగుండ ప్రవేశం జరిగింది. ఉదయం నుంచి స్వామివార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. రాత్రి పోతురాజును శిరస్సుపై ఉంచుకుని గ్రామశివారు నుంచి ఊరేగింపుగా భక్తులు తరలివచ్చారు. అక్కడ స్వామివారికి పూజలు నిర్వహించి అగ్నిగుండ ప్రదేశానికి చేరుకున్నారు. అక్కడ శాస్త్రోత్తంగా పూజలు నిర్వహించి అగ్నిగుండ ప్రవేశం చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో అగ్నిగుండాన్ని తాకి మొక్కులు తీర్చుకున్నారు. చివరిగా అర్ధరాత్రి సమయంలో స్వామివారి తెప్పోత్సవం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా చెన్నై శక్తి ఈవెంట్స్ పాటకచ్చేరి నిర్వహించింది. ఈ కార్యక్రమాలకు విచ్చేసిన ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, టీడీపీ అధికార ప్రతినిధి సుధాకర్‌రెడ్డి, నాయకులు పార్థసారథి, ఆకుతోట రమేష్, సెల్వం, మాధవనాయుడు తదితరులను ఆలయ కమిటీ నిర్వాహకులు బొమ్మల ఫణి, శ్రీధర్, ధనుంజయలు శాలువాలతో సత్కరించారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రవేశ పరీక్షలు

కోట, మే 4 (ఆంధ్రజ్యోతి): కోటలోని మహాత్మాజ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్షలు ఆదివారం జరిగాయి. 215మంది విద్యార్థులకు 162మంది హాజరయ్యారు.

కోటమ్మకు పూజలు

కోట, మే 4 (ఆంధ్రజ్యోతి): గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో ఉంచారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ముత్యాలమ్మకు...

చిల్లకూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం పూజలు జరిగాయి. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా నివేదించారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

పేదలకు న్యాయం చేయాలి

గూడూరు అర్బన్, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాగుంటలో భూములకు సంబంధించి పేదలకు న్యాయం జరిగేలా అధికారులు వారికి చర్యలు తీసుకోవాలని ఏపీ ప్రజాసంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మునెయ్య కోరారు. కొండాగుంటలో పేదల భూములను రీసర్వే పేరుతో ఇతరుల పేరు మీద రికార్డుల్లో నమోదు చేయడం జరిగిందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పేదలకు న్యాయం చేయాలన్నారు.